PRGI Reg No -“APTEL/26/A1193

నేటి శుభోదయ
ప్రతి క్షణం – ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....

ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 160, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, గురువారం - 30 - జూలై - 2026 , వెల రూ.5/-

# టమోటా కిలో రూ.10లోపే..



టమోటా రైతులకు ఈసారి ఆదిలోనే
హంసపాదు అన్న పరిస్థితి ఎదురవుతోంది.
ఎన్నో ఆశలతో సాగు చేసిన పంట చేతికొచ్చిన సమయంలో ధరల పతనం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.
గత ఏడాది రూ.30 పైగా పలికిన ధర

అనంతపురం: టమోటా రైతులకు ఈసారి ఆదిలోనే హంసపాదు అన్న పరిస్థితి

# హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయి

హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయని..
కానీ ప్రజల్లో హైడ్రాపై విశ్వాసం పెరుగుతోందని అన్నారు మంత్రి శ్రీధర్ బాబు.
రాజకీయ ప్రయోజనాల కోసమే వ్యతిరేక ప్రచారం జరుగుతోందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు..



హైదరాబాద్, జులై 28 హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయని, హైడ్రాపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, రాజకీయ ప్రయోజనాల కోసమే వ్యతిరేక ప్రచారం జరుగుతోందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మిగతా..2లో

## ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కోవడంలో 'రైతునేస్తం' కీలక పాత్ర: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



- రైతు చెంతకు నూతన సాంకేతికతే 'రైతునేస్తం' లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.
- రైతు – శాస్త్రవేత్త – అధికారుల అనుసంధానానికి దేశంలోనే తొలి డిజిటల్ వేదిక రైతునేస్తమని అన్నారు.

హైదరాబాద్, జులై 28: రైతు చెంతకు నూతన సాంకేతికతే 'రైతునేస్తం' లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈరోజు(మంగళవారం) రైతునేస్తం 100వ ఎపిసోడ్‌ను ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది.

# హైడ్రా కమిషనర్‌ను తప్పించాలన్న హైకోర్టు..

## ఘాటుగా స్పందించిన రేవంత్ రెడ్డి

- హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలన్న హైకోర్టు ఆదేశాలను సమీక్షిస్తామన్న సీఎం
- హైడ్రా అనేది ప్రభుత్వం తెచ్చిన అతిపెద్ద సంస్కరణ అని వెల్లడి
- ఆక్రమణదారులు నకిలీ పత్రాలతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణ


వివరాలు 2లో..

హైదరాబాద్: హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను తక్షణం విధుల నుంచి తప్పించాలంటూ హైకోర్టు వెలువరించిన ఆదేశాలపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. ఈ ఉత్తర్వులను సమీక్షిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైడ్రా కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని,

## తెలంగాణ టీవీ అవార్డులపై ప్రభుత్వం కసరత్తు



- అవార్డులకు పీవీ పేరు పరిశీలన
- సీఎం రేవంత్‌తో చర్చించి తుది నిర్ణయం
- లోగో, కేటగిరీలపై సమీక్ష
- పారదర్శక ఎంపికకు మంత్రి ఆదేశాలు
- బుల్లితెర వర్గాల్లో హర్షం

హైదరాబాద్: తెలంగాణలో టెలివిజన్ రంగానికి ప్రత్యేక గుర్తింపు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బుల్లితెర కళాకారులు, సాంకేతిక నిపుణులను ప్రోత్సహించేలా టెలివిజన్ అవార్డులను ప్రవేశపెట్టే ప్రక్రియ వేగవంతమైంది. ఈ అవార్డులకు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరు పెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. మిగతా..2లో

## పదే పదే లీకేజీలు జరుగుతున్నా కేంద్రం చోద్యం చూస్తోంది

### లోక్‌సభలో గౌరవ్ గొగోయ్



- పేపర్ లీక్‌పై లోక్‌సభలో ప్రస్తావించిన కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్
- పదే పదే లీకేజీలు జరుగుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తూ ఉండిపోయిందంటూ వ్యాఖ్య
- లీకేజీ నిందితులకు బెయిల్ ఇచ్చిందని ఆరోపణ

## విద్యార్థులు ఏమైనా ఉగ్రవాదులా వారిపై ఏకే 47 గురిపెట్టాల్సిన పనేముంది?”

### మోదీ సర్కార్‌పై ప్రియాంక గాంధీ ఫైర్?

- చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు న్యాయం జరగాలి
- కేంద్ర ప్రభుత్వ వైఖరిపై యువత ఆగ్రహంతో ఉన్నారు
- లోక్‌సభలో ప్రియాంక గాంధీ కీలక వ్యాఖ్యలు



ఢిల్లి : నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జీ చేయడంపై కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ మండిపడ్డారు. విద్యార్థులను పోలీసులు లాఠీలతో కొట్టారని, బాష్పవాయువు ప్రయోగించారని, ముఖ్యంగా బాలికల వస్త్రాలు లాగి, అసభ్యంగా, అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు. జరిగిన అక్రమాలపై పోరాడుతున్న యువతపై పెల్లెట్ గన్స్, ఏకే-47 ప్రయోగించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. మిగతా..2లో

# యూపీఏ హయాంలో ఎన్నో పేపర్ లీకేజీలు జరిగాయ్?

- లోక్‌సభలో నీట్ పేపర్ లీక్ అంశంపై చర్చ
- అన్ని పక్షాలు అంగీకరించాయన్న స్పీకర్?


2లో

ఢిల్లి : నీట్ పేపర్ లీక్ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంగళవారం లోక్?సభ స్పీకర్? ఓం బిర్లా పేర్కొన్నారు. ఈ అంశానికి సంబంధించిన అన్ని అంశాలపై చర్చకు విపక్షాలు కూడా అంగీకరించాయని అన్నారు. లోక్?సభలో చాలా ముఖ్యమైన బిల్లులపై చర్చ జరగాల్సి ఉందని, కనుక సభ సజావుగా సాగేందుకు సభ్యులు అందరూ సహకరించాలని కోరారు. చర్చకు అవసరమైతే అదనంగా సమయం కేటాయిస్తామని స్పష్టం చేశారు.

### ఎన్ని గంటలైనా చర్చిద్దాం!

మరోవైపు నీట్ పేపర్ లీక్? అంశంపై ఎన్ని గంటలైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. 6, 8 గంటలు కాదు 10 గంటలైనా చర్చకు సిద్ధమేనని, కానీ సభ సజావుగా సాగడం విపక్షాలకు ఇష్టం ఉండదని పేర్కొన్నారు.

## కుప్పంలో కొనసాగుతున్న నారా భువనేశ్వరి పర్యటన.. క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ ప్రారంభం




- కుప్పంలో రెండో రోజు పర్యటించిన నారా భువనేశ్వరి
- క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ తో పాటు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన వైనం
- కుప్పానికి 30 పరిశ్రమలు తెచ్చి వేలాది ఉద్యోగాలు కల్పిస్తామన్న భువనేశ్వరి
- రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని వెల్లడి
- డీఎస్సీపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని వ్యాఖ్య

## దేశంలోనే తొలిసారిగా అమరావతిలో ప్రెసిషన్ ఆంకాలజీ క్యాన్సర్ సెంటర్...

# ఏపీ ప్రభుత్వంతో ఆస్ట్రాజెనెకా ఒప్పందం

- ఏపీ ప్రభుత్వంతో ఆస్ట్రాజెనెకా, ఇతర దిగ్గజ సంస్థల ఒప్పందం
- అమరావతిలో ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్ ఏర్పాటు
- ఊపిరితిత్తులు, రొమ్ము కేన్సర్ రోగులకు అధునాతన జన్యు పరీక్షలు
- దేశంలోనే తొలిసారిగా ప్రెసిషన్ ఆంకాలజీ విధానం ప్రారంభం
- అందరికీ ఆధునిక వైద్యం అందించడమే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య రంగంలో మరో కీలక ముందడుగు పడింది. అంతర్జాతీయ ఫార్మా, బయోటెక్ దిగ్గజ సంస్థలైన ఆస్ట్రాజెనెకా, స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూర్ ఏఐ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం కీలక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఈ ఒప్పందాలు జరిగాయి. ఈ ఒప్పందంలో భాగంగా, అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ ఆంకాలజీ విధానాన్ని ప్రారంభించనున్నారు. ఈ ఒప్పందం ప్రకారం ఆస్ట్రాజెనెకా ఇండియా, అమరావతిలో 'ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్'ను ఏర్పాటు చేయనుంది. ఈ కేంద్రం ద్వారా ముఖ్యంగా ఊపిరితిత్తులు, రొమ్ము కేన్సర్ రోగులకు అవసరమైన అధునాతన జన్యు పరీక్షలు, బయోమార్కర్ టెస్టింగ్ సేవలను అందిస్తారు. దీనివల్ల కేన్సర్ చికిత్సలో కచ్చితమైన, వేగవంతమైన ఫలితాలు సాధించేందుకు వీలు కలుగుతుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరికీ అందుబాటు ధరల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలు తీసుకురావడమే ఈ ఒప్పందం లక్ష్యమని పేర్కొన్నారు. మిగతా..2లో

## 29 వేల రేషన్ దుకాణాలు మరింత బలోపేతం



- ఏపీ పౌరసరఫరాల శాఖలో చేపడుతున్న సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం ప్రశంసించిందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.
- కాకినాడలో ప్రజా పంపిణీ వ్యవస్థలో స్టీమ్ రైస్ పైలట్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు.

ఢిల్లీ, జులై 28: ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖలో చేపడుతున్న సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం ప్రశంసించిందని మిగతా..2లో

## దేశంలోనే తొలిసారిగా అమరావతిలో ప్రెసిషన్ ఆంకాలజీ క్యాన్సర్ సెంటర్... ఏపీ ప్రభుత్వంతో ఆస్ట్రాజెనెకా ఒప్పందం

కేవలం వైద్య సేవలే కాకుండా, ఫార్మా, బయోటెక్నాలజీ రంగాల్లో క్వాంటం స్థాయి పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఈ ఒప్పందంతో ఏపీ ఆరోగ్య, పరిశోధన రంగాలకు కొత్త ఊపు వస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

### హైడ్రా కమిషనర్‌ను తప్పించాలన్న హైకోర్టు..

## ఘాటుగా స్పందించిన రేవంత్ రెడ్డి

ఆ సంస్థను మరింత బలోపేతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైడ్రా అనేది తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అతిపెద్ద సంస్కరణ అని అభివర్ణించారు. ఆక్రమణదారులు నకిలీ పత్రాలతో న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తూ, సోషల్ మీడియా వేదికగా ఏజెన్సీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. "బతుకమ్మ కుంటను ఆక్రమించింది పేదలా లేక పెద్దలా? ఒక బీఆర్ఎస్ నేత అక్కడ 10 ఎకరాలు కబ్జా చేశారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా? గండిపేట చెరువు వద్ద కూల్చివేసినవి సామాన్యుల నిర్మాణాలా?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. భూ కబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. కబ్జాదారులను రక్షించేందుకు భారీగా నిధులు వెచ్చిస్తూ సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. గతంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సోమేశ్ కుమార్‌పై 400 కోర్టు ధిక్కరణ కేసులు ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. హైడ్రా విషయంలో ప్రభుత్వానికి పూర్తి స్పష్టత ఉందని, ఒక అధికారిని ఎక్కడ నియమించాలన్నది ప్రభుత్వ విచక్షణాధికారమని ఆయన పేర్కొన్నారు. తప్పుడు కేసులను న్యాయస్థానాల్లోనే ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

## తెలంగాణ టీవీ అవార్డులపై ప్రభుత్వం కసరత్తు

టెలివిజన్ అవార్డు కమిటీ ప్రతినిధులతో మంత్రి సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అవార్డుల లోగో, కేటగిరీలు, పేరుపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ సంస్కృతి, ఆత్మను ప్రతిబింబించేలా లోగో, పేరు ఉండాలని మంత్రి సూచించారు. తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరును అవార్డులకు పెట్టే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అవార్డుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. అందుకు అవసరమైన సమగ్ర మార్గదర్శకాలను త్వరగా సిద్ధం చేయాలని టెలివిజన్ అవార్డు కమిటీ సభ్యులకు ఆదేశించారు. ప్రభుత్వ నిర్ణయంపై బుల్లితెర రంగానికి చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కోవడంలో

## 'రైతునేస్తం' కీలక పాత్ర

సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. రైతు - శాస్త్రవేత్త - అధికారుల అనుసంధానానికి దేశంలోనే తొలి డిజిటల్ వేదిక రైతునేస్తమని అన్నారు. 2024 మార్చి 6న ప్రారంభమైన రైతునేస్తం.. నేడు 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. ఇప్పటివరకు 27.30 లక్షల మందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూరినట్లు వెల్లడించారు. ప్రతి మంగళవారం రైతుల ప్రశ్నలకు ప్రత్యక్షంగా శాస్త్రవేత్తలు సమాధానాలు ఇస్తున్నారని మంత్రి తెలిపారు. ఎల్-నినో సవాళ్లను ఎదుర్కోవడంలో రైతునేస్తం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అధిక నీరు అవసరమయ్యే వరి సాగుపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయిల్ పామ్, ఉద్యాన, తక్కువ నీటితో సాగయ్యే పంటలపై దృష్టి సారించాలన్నారు. జులైలో 27 శాతం వర్షపాతం లోటు నమోదైందని వెల్లడించారు. ఆగస్టు 10 ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. భూగర్భ జలాల సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు అందించాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వివిధ జిల్లాలకు చెందిన ఆదర్శ రైతులను మంత్రి సన్మానించారు.

### విద్యార్థులు ఏమైనా ఉగ్రవాదులా వారిపై

## ఏకే-47 గురిపెట్టాల్సిన పనేముంది?

విద్యార్థులు ఏమైనా ఉగ్రవాదులా అని మోదీ సర్కార్‌ను లోక్‌సభలో నిలదీశారు. "విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఏకే 47 ప్రయోగించాల్సిన అవసరం ఏంటి?విద్యార్థులు ఏమైనా ఉగ్రవాదులా ప్రభుత్వమే దీనికి జవాబు ఇవ్వాలి. విద్యార్థులపై గన్స్? ఎక్కుపెట్టాలని ఎవరు ఆదేశించారు ప్రధాని మోదీనా, హోంమంత్రి అమిత్ షానా ఎవరు ఈ విధంగా ఆదేశించారని దేశమంతా ప్రశ్నిస్తోంది. ఈ విషయాన్ని కాంగ్రెస్ కాదు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థుల ప్రశ్నలకు జవాబులు ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత. దేశ యువత అంటే మీకు ఎందుకంత భయం. ప్రజల గొంతును అణిచివేసే హక్కు మీకు ఎవరు ఇచ్చారు

## హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయి

ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న సంస్థ హైడ్రా అని, అందుకే సాధారణ ప్రజలు దీనిని స్వాగతిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. హైడ్రాకు మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా ర్యాలీలు నిర్వహించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలకు ప్రజల నుంచి వస్తున్న మద్దతును చూసి కొందరు రాజకీయ పార్టీలు అసహనం వ్యక్తం చేస్తున్నాయని విమర్శించారు. హైడ్రాను అడ్డుకునేందుకు రాజకీయ ప్రయోజనాల కోసమే కొందరు కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి హైడ్రాపై కుట్రలు చేస్తున్నాయన్నారు. కోర్టు వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి గౌరవం ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. హైడ్రాకు సంబంధించిన పూర్తి తీర్పు ఇంకా వెలువడలేదని, తుది తీర్పు వచ్చిన తర్వాత ప్రభుత్వం చట్టపరంగా ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రభుత్వం తరపున చెప్పాల్సిన అన్ని అంశాలనూ కోర్టు ముందే వివరిస్తామని, న్యాయ ప్రక్రియను పూర్తిగా గౌరవిస్తామని చెప్పారు. అయితే కోర్టు తీర్పు పూర్తిగా రాకముందే కొన్ని రాజకీయ పార్టీలు, ముఖ్యంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా వేదికల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. వాస్తవాలు బయటకు వచ్చే వరకూ ప్రజలు పుకార్లను నమ్మవద్దని, అధికారిక సమాచారం ఆధారంగానే స్పందించాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

### విద్యార్థుల నిరసన కేంద్రానికి చెంపపెట్టు..

నీట్ పరీక్ష అనేది కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. విద్యార్థుల నిరసనలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వారి ఆకాంక్షలకు చెంపపెట్టులాంటిదని విమర్శించారు. ప్రధాని నివాసం ముందు రాహుల్ గాంధీ చేపట్టిన నిరసనతో ఈ ఉద్యమం మరింత ఉధృతమైందని చెప్పారు. కాంగ్రెస్ చేపట్టిన ఉద్యమాల వల్లే దేశవ్యాప్తంగా నిరసనలు విస్తరించాయని పేర్కొన్నారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకుల్లో 90 శాతం మంది జెన్-జీ యువతేనని శ్రీధర్‌బాబు తెలిపారు. యువత ఆలోచనలకు అనుగుణంగా పనిచేసే నాయకత్వం సీఎం రేవంత్ రెడ్డిదని కొనియాడారు. జెన్-జీతో పోటీ పడే ఆలోచనా విధానం ఆయనకు ఉందన్నారు. రాష్ట్రంలో ఎవరు మంత్రులు కావాలన్నది కాంగ్రెస్ అధిష్ఠానం (ఏఐసీసీ) నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.

## సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లకు పార్లమెంటరీ ప్యానెల్ సమన్లు- ఆగస్టు 3న హాజరవ్వాలని ఆదేశం

### కమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి అధ్యక్షుడు బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే వెల్లడి

ఢిల్లీ : సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల నియంత్రణపై చర్చించేందుకు, ఇన్‌స్టాగ్రామ్‌తో సహా ప్రధాన సామాజిక మాధ్యమాల ప్రతినిధులకు పార్లమెంటరీ ప్యానెల్ సమన్లు జారీ చేసింది. వీరితో పాటు, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మీటీ), హోం శాఖల అధికారులను ఆగస్టు 3న హాజరు కావాలని ఆదేశించింది. ఈ మేరకు కమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి అధ్యక్షత వహిస్తున్న బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే వెల్లడించారు. మహిళలు, పిల్లలు, రైతులు, గ్రామీణులు, కార్మికులు, సాధారణ ప్రజల గోప్యతను ఎలా పరిరక్షిస్తారు? ప్రజా శాంతిభద్రతలను ఎలా నిర్ధారిస్తారు? అనే దానిపై వివరించడానికి మెటా (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్), గూగుల్, ఎక్స్, స్నాప్‌చాట్ ప్రతినిధులకు ప్యానెల్ సమన్లు ఇచ్చిందని తెలిపారు. "2026 ఆగస్టు 3వ తేదీన సాయంత్రం 4 గంటలకు ఐటీ, కమ్యూనికేషన్ పార్లమెంటరీ కమిటీ మెటా (ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్), , స్నాప్‌చాట్, గూగుల్ సంస్థలను పిలిపించింది. మహిళలు, పిల్లలు, రైతులు, గ్రామీణ ప్రజలు, కార్మికులు, సాధారణ ప్రజల గోప్యతను ఎలా కాపాడతారు? ఈ కంపెనీలు ప్రభుత్వ ప్రజా శాంతిభద్రతలను ఎలా నిర్ధారిస్తాయి? ఈ అంశాలపై సంస్థల ప్రతినిధులను ప్రశ్నిస్తాం." నిశికాంత్ దూబే ఎక్స్‌లో పేర్కొన్నారు. "'సామాజిక- డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, వాటి నియంత్రణ' అనే అంశంపై ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (మీటీ), హోం శాఖ, సామాజిక, డిజిటల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు స్నాప్‌చాట్, గూగుల్, ఎక్స్ (గతంలో ట్విట్టర్), మెటా (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్) ప్రతినిధుల వివరణ ఇస్తారు." అని నోటీసుల్లో పేర్కొన్నారు.

మెటాకు కేంద్రం నోటీసులు

మంగళవారం మెటాకు సంబంధించిన ఒక ఘటన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. పరీక్షా పత్రాల లీక్‌లపై చర్యలు తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ చేసిన వీడియోను ఫేస్‌బుక్ నుంచి కొద్దిసేపు తొలగించి ఆ తర్వాత పునరుద్ధరించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి మెటాసంస్థ క్షమాపణలు చెప్పింది. మోదీ వీడియోను ఉద్దేశపూర్వకంగా లేక కంటెంట్ పాలసీ కారణంగానో తొలగించలేదని,

## కుప్పంలో కొనసాగుతున్న నారా భువనేశ్వరి పర్యటన.. క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గంలో తన పర్యటనను రెండో రోజు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆమె పలు అభివృద్ధి, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, స్విమ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ కేంద్రాన్ని, టీఎన్ఎస్ఎఫ్ నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ.. క్యాన్సర్ మహమ్మారిపై మహిళల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ ఏర్పాటు చేసిన స్విమ్స్ ప్రతినిధులను అభినందించారు. ముందస్తు జాగ్రత్తలు, చైతన్యం ద్వారా క్యాన్సర్ ముప్పు నుంచి మహిళలను



కాపాడవచ్చని తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా కూడా ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నామని, ముఖ్యంగా తలసీమియా వ్యాధిగ్రస్త పిల్లలకు ఉచితంగా సురక్షితమైన రక్తాన్ని అందిస్తూ అండగా నిలుస్తున్నామని వివరించారు. కుప్పం అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ పెట్టారని భువనేశ్వరి అన్నారు. గతంలో ఇక్కడి నుంచి ఉపాధి కోసం యువత కర్ణాటకకు వలస వెళ్లేవారని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారుతుందని భరోసా ఇచ్చారు. సీఎం చంద్రబాబు ఒకేసారి కుప్పానికి 30 పరిశ్రమలు తీసుకువచ్చారని, వీటి ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు సీఎం అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం రాజకీయ అంశాలపై మాట్లాడుతూ.. డీఎస్సీ నిర్వహణపై వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆమె వ్యాఖ్యానించారు. కుప్పం ప్రజలు తనను ఎంతో ఆదరిస్తున్నారని, వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## 29 వేల రేషన్ దుకాణాలు మరింత బలోపేతం

మొదటి పేజీ తరువాయి

మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కాకినాడలో ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్)లో స్టీమ్ రైస్ పైలట్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. అదనంగా 20 వేల మెట్రిక్ టన్నుల పార్బాయిల్డ్ ధాన్యం సేకరణకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. రేషన్ దుకాణాల ద్వారా 'మీ మార్ట్' కాన్సెప్ట్‌ను అమలు చేయనున్నట్లు తెలిపారు. రైతు బజార్లలో తక్కువ ధరలకు నాణ్యమైన బియ్యాన్ని విక్రయించే కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. ఏపీ వ్యాప్తంగా స్వర్ణ వెరైటీ బియ్యాన్ని కిలో రూ.40కు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. రేషన్ కార్డుదారులకు 500 గ్రాముల కందిపప్పు అందించే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. పౌరసరఫరాల శాఖకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.281 కోట్ల నిధుల విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ధాన్యం ట్రాకింగ్‌కు ఆర్ఎఫ్ఐడీ టెక్నాలజీని అమలు చేస్తున్నామని అన్నారు. డిజిటల్ వాలెట్ విధానం ద్వారా సబ్సిడీల పంపిణీకి పైలట్ ప్రాజెక్ట్ చేపడుతున్నామని చెప్పారు. ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్ల కమిషన్ పెంపునకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 29 వేల రేషన్ దుకాణాలను మరింత బలోపేతం చేస్తామన్నారు. రాష్ట్రంలో బియ్యం ధరల స్థిరీకరణపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. మిల్లర్లతో చర్చలు జరిపామని, ప్రస్తుతం కిలో రైస్ ధర రూ.52 వద్ద ఉండేలా నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ వెరైటీ రైస్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.



## యూపీఏ హయాంలో ఎన్నో పేపర్ లీకేజీలు జరిగాయ్?

మొదటి పేజీ తరువాయి



"నేను కాంగ్రెస్?, సమాజ్?వాదీ పార్టీ, డీఎంకే, ఎన్?సీపీ సహా వివిధ పార్టీల నేతలతో మాట్లాడాను. షెడ్యూల్ చేసిన 6 గంటల చర్చను మరో 2 గంటలు పొడిగించి 8 గంటలు చేయడానికి అందరూ అంగీకరించారు. మరింత సమయం కావాలంటే చర్చను ఇంకా పొడిగించడానికి ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదు. విపక్షాలు కోరుకుంటే 10 గంటలపాటు చర్చించడానికి మేము సిద్ధంగా ఉన్నాం."

**కిరణ్ రిజిజు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి**

### అక్రమార్కులకు కఠిన శిక్షలు

ఇకపై పేపర్ లీకేజీలకు పాల్పడిన వారికి కఠినంగా శిక్షించేందుకు "పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026" బిల్లు తీసుకొచ్చామని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్? పేర్కొన్నారు. దోషులకు జైలు శిక్షను 10 ఏళ్లకు పెంచామని, లీకేజీ గ్యాంగ్‌లకు జరిమానాను రూ.1 కోటి నుంచి రూ.10 కోట్లకు పెంచామని చెప్పారు. ఈ కేసుల విచారణకు ప్రత్యేక ఫాస్ట్? ట్రాక్? కోర్టులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదిత బిల్లు చట్టమైతే సత్వర న్యాయం జరుగుతుందని అన్నారు. పరీక్ష పేపర్ లీకేజీలు అరికట్టేందుకు నందన్ నిలేకని ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఇంతకు ముందు యూపీఏ ప్రభుత్వ హయాంలో ఎన్నో ఎంట్రన్స్? పరీక్షలు, ఉద్యోగ పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయని జితేంద్ర సింగ్ గుర్తుచేశారు. 2009, 2011లో ఎన్నో పేపర్ లీక్స్, 2010లో యూపీలో బీఈడీ పేపర్ లీక్?, 2012లో ఎయిమ్స్ ఎంట్రన్స్ పేపర్ లీక్, తమిళనాడులో పీఎస్సీ పేపర్ లీక్? జరిగాయి. క్రమంగా ఇవి వ్యవస్థీకృత నేరాలుగా మారాయి. వీటిని అరికట్టేందుకు 1992, 2010లో కొన్ని ప్రయత్నాలు జరిగాయని, కానీ అవి ఎందుకు ఫలించలేదో ఆనాటి పాలకులే చెప్పాలని జితేంద్ర సింగ్ అన్నారు. ప్రస్తుతం ఎన్?డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్? బిల్లు అనేది విద్యార్థులు, యువత పట్ల మోదీ సర్కార్?కు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. ఇది భారత పార్లమెంట్ చరిత్రలోనే నిలిచిపోతుందని అన్నారు. ఉమ్మడి పరీక్ష విధానాన్ని (కామన్ టెస్టింగ్ సిస్టమ్) ఏర్పాటు చేయడానికి గతంలో జరిగిన ప్రయత్నాలను కూడా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రస్తావించారు. 2017లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. "చరిత్రను పరిశీలిస్తే 1992లో మొదటిసారి ఉమ్మడి పరీక్ష కోసం సిఫార్సు చేయడం జరిగింది. 2010లో యూపీఏ పాలనలో ఒక కమిటీ ఏర్పాటు అయ్యింది. కానీ ఆ పని మధ్యలోనే నిలిచిపోయింది. అలా నిలిచిపోయిన పనిని పూర్తి చేసినందుకు మీరు ప్రధాని మోదీని, ఈ ప్రభుత్వాన్ని అభినందించాలి" అని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

## పదే పదే లీకేజీలు జరుగుతున్నా కేంద్రం చోద్యం చూస్తోంది

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ : లీకేజీ కేసుల విచారణలో ప్రభుత్వం ఉదాసీన వైఖరి ప్రదర్శించిందని, అనేక లీకేజీ కేసుల్లోని నిందితులకు ప్రభుత్వం బెయిలిచ్చిందని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ వ్యాఖ్యానించారు. నీట్ లీకేజీతో 21 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నా ప్రధాని కనీసం స్పందించలేదని, ఇప్పుడు టాస్క్‌ఫోర్స్ వేశామంటూ ప్రధాని చెప్పడం పట్ల ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. రెండేళ్ల క్రితం కూడా నిపుణుల కమిటీ వేశారని, దానిపై ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. అప్పుడే కఠిన చర్యలు తీసుకుని ఉంటే మళ్లీ లీకేజీ జరిగేది కాదు కదా అని మండిపడ్డారు. రెండేళ్ల క్రితం పబ్లిక్ ఎగ్జామినేషన్స్-యాక్ట్ 2024 పేరుతో బిల్లును తీసుకువచ్చిందని, ఆ సమయంలో బిల్లు ప్రవేశపెడుతూ, ఇదొక చరిత్రాత్మక అడుగని, ఇకపై ప్రశ్న పత్రాల లీకేజీలు జరగవని ప్రభుత్వం పేర్కొందని గొగోయ్? గుర్తుచేశారు. అంతేకాదు, ఈ ఆ బిల్లులో కఠినమైన నిబంధనలను పొందుపర్చామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుందని దుయ్యబట్టారు. పదే పదే లీకేజీలు జరుగుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తూ ఉండిపోయిందని వ్యాఖ్యానించారు. విద్యను కూడా ఓట్లు సంపాదించే మార్గంగా ఎన్‌డీఏ సర్కారు భావిస్తోందని గొగోయ్ ఆరోపించారు. లోక్‌సభలో యాంటీ- పేపర్ లీక్‌బిల్లుపై చర్చలో గౌరవ్ గొగోయ్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు, 2026పై గొగోయ్ మాట్లాడారు. "దేశంలో జరిగిన పేపర్ లీకేజీల కారణంగా 21 మంది విద్యార్థులు తమ ప్రాణాలను కోల్పోయారు. ఏ మంత్రి హయాంలో అయితే 21



మంది అమాయక పిల్లలు ప్రాణాలు కోల్పోయారో, ఆయన తన పదవికి రాజీనామా చేసి నిన్న పార్లమెంట్‌కు తిరిగి వచ్చినప్పుడు అధికార పక్ష సభ్యులు ఆయనకు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. అదేదో పాకిస్థాన్‌పై యుద్ధం గెలిచి తిరిగి వచ్చిన వీరుడిలా ఆయనకు స్వాగతం పలికారు. క్యాబినెట్ సమావేశంలో పేపర్-సెట్టింగ్, సాల్వింగ్, టెస్టింగ్ సెంటర్ మాఫియా వంటి వాటిని ఎలా నిర్మూలించాలి అనే దానిపై సమగ్రంగా చర్చించడానికి బదులుగా, ప్రధానమంత్రి మోదీ కేవలం ఇన్‌స్టాగ్రామ్‌పై ఎక్కువ దృష్టి పెట్టమని తన కేబినెట్ మంత్రులను ప్రోత్సహిస్తున్నారు."- గౌరవ్ గొగోయ్, కాంగ్రెస్ ఎంపీ

### 'ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్నవారికే వర్సిటీ పదవులు'

ఇక, పదే పదే జరుగుతున్న పేపర్ లీకేజీ ఘటనలపై గౌరవ్ గొగోయ్? తీవ్రంగా మండిపడ్డారు. తరచూ లీకేజీలు జరుగుతున్నా ఎన్‌టీఏ ఛైర్మన్‌ను ఎందుకు తొలగించలేదని ఆయన ప్రశ్నించారు. "ఎన్?టీఏ ఛైర్మన్ గతంలో మధ్యప్రదేశ్ పీఎస్సీ ఛైర్మన్‌గా ఉన్నారు. అంతకుముందు, ఎంపీపీఎస్సీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడూ ఆయనపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఒక విషయం ఆలోచిస్తే, ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్నవారినే వర్సిటీ పదవుల్లో నియమిస్తున్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్నవారినే ఔట్‌సోర్సింగ్ పోస్టుల్లోకి తీసుకుంటున్నారు" అని గొగోయ్ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు.

'విద్యార్థులు లాఠీఛార్జ్‌కు కూడా భయపడలేదు'

మరోవైపు, దేశ రాజధాని దిల్లీలో జరిగిన ఘర్షణల్లో యువకుడు భగత్‌సింగ్ పోరాట పటిమ చూపాడని, తమ భవిష్యత్తు కోసం విద్యార్థులు లాఠీఛార్జ్‌కు కూడా వెరువలేదని గొగోయ్? పేర్కొన్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా యువ శక్తి కదం తొక్కిందని తెలిపారు. పోరాట స్ఫూర్తి చాటిన విద్యార్థి లోకానికి ఆయన ధన్యవాదాలు చెప్పారు. అయితే, జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల పోరాటానికి ఎందరో మద్దతిచ్చారని, మరికొందరు విద్యార్థులకు ఆహారం, ఆశ్రయం ఇచ్చారని పేర్కొన్నారు. కానీ, విద్యార్థులపై ప్రభుత్వం మాత్రం అమానవీయంగా ప్రవర్తించిందని గొగోయ్ విమర్శించారు. విద్యార్థుల తలలపై, మర్మాంగాలపై పోలీసులు కొట్టారని, వారిని అలా చేయమని ఎవరు ఆదేశించారని గొగోయ్ ప్రశ్నించారు. మొత్తానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ డిమాండ్ల మేరకే ఈ బిల్లులో శిక్షలు పెంచారని ఆయన పేర్కొన్నారు.

## టమోటా కిలో రూ.10లోపే..

మొదటి పేజీ తరువాయి

సీజన్ ప్రారంభంలోనే పరిస్థితులు తలకిందులు కావడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలోకి పడిపోయారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చేలా కనిపించలేదని కన్నీరుపెడుతున్నారు. కష్టపడి పండించిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండాపోతోందని వాపోతున్నారు. చేసేదిలేక పంటను తోటలోనే వదిలేయడం, లేదంటే రోడ్లపక్క పారబోసే దృశ్యాలు నిత్యం కనిపిస్తున్నాయి.

### ఆదిలోనే పతనమైన ధరలు

ఉమ్మడి జిల్లాలో కొన్నేళ్లుగా టమోటా సాగు బాగా పెరిగింది. సాధారణంగా సీజన్ ప్రారంభంలో ధరలు ఆశాజనకంగా ఉంటాయి. దీంతో రైతులు ముందస్తుగా పంట సాగు చేస్తున్నారు. మే, జూన్‌లో ఎండలతో ప్రతికూల పరిస్థితులు ఉన్నా మొక్కలు నాటి సంరక్షించుకుంటున్నారు. దీని వల్ల సీజన్ ప్రారంభంలోనే పంట మార్కెట్‌కు తరలిస్తే మంచి గిట్టుబాటు ఉంటుందని రైతులు భావిస్తున్నారు. కానీ ఈసారి పరిస్థితి తల్లకిందులయింది. దిగుబడి బాగా ఉన్నా.. ధరల పతనంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం మండలాల్లో ఎక్కువగా సాగు చేశారు.

### నాడు కలకల.. నేడు వెలవెల

గత ఏడాది సీజన్ ప్రారంభంలో కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో గరిష్ట ధరలు రూ.30 నుంచి రూ.40 మధ్య పలికాయి. 15 కిలో బాక్సుకు రూ.450 నుంచి రూ.600 వరకు లభించింది. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు ఈసారి ముందస్తుగానే పంట సాగు చేశారు. ప్రస్తుతం ఆశించిన స్థాయిలో ధరలు లేకపోవడంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ప్రస్తుతం కిలో గరిష్ట ధర రూ.10 నుంచి రూ.12మధ్య ఊగిసలాడుతోంది.

### తగ్గిన ఎగుమతులు



ధరలు పతనానికి ఎగుమతులు మందగించడమే ప్రధాన కారణమని వ్యాపార వర్గాలు అంటున్నా యి. ఉమ్మడి జిల్లాలో సుమారు 23వేల హెక్టార్లలో టమోటా సాగులో ఉన్నట్లు సంబంధిత అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇందులో 20శాతం కోత ద శలో ఉందంటున్నారు. పంట దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో కాయలు మార్కెట్ పెద్ద ఎత్తు న వస్తున్నాయి. అనంతపురం కక్కలపల్లి ప్రైవేట్ మార్కెట్‌కు రోజుకు మూడువేల టన్నులకు పైగానే కాయలు వస్తున్నాయి. కళ్యాణదుర్గం మార్కెట్‌కు కూడా బాగానే వస్తున్నాయి. ఎగుమతులు లేకపోవడం ధరలు లేకపోవడానికి కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. కోలారు, మదనపల్లి, కలికిరి మార్కెట్‌లోనూ ఇదే పరిస్థితి.

### పారబోస్తున్న రైతులు

టమోటాకు ధరలు లేకపోవడంతో ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల రైతులు పంటను పారబోస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చుచేస్తున్నారు. కట్టెల మీద సాగుకు మరో రూ.50వేలు అదనంగా అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలతో కనీసం పెట్టుబడుల్లో సగం కూడా రావడం గగనమేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధరలు లేకపోవడంతో కొంతమంది పంటను తోటల్లోనే వదిలేస్తున్నారు. మరి కొందరు పశువుల మేతకు, రోడ్లపై పారబోస్తున్న ఘటనలు ఇటీవల కళ్యాణదుర్గం, కదిరి ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి.

### మంచిరేటు వస్తుందనుకున్నా..

రెండు ఎకరాల్లో పంట సాగు చేశా. ప్రస్తుతం ఐదో కటింగ్ పడింది. 265 బాక్సులు అయ్యాయి. 15 కిలోల బాక్సు రూ.170తో అమ్ముడుపోయాయి. సీజన్ మొదట్లో మంచి రేటు ఉంటుందని ముందస్తుగానే సాగు చేశా. ముందుసారి ఈ సమయంలో ధరలు బాగా పలికాయి. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. కనీసం బాక్సు రూ.250పైనే పలికితేనే పెట్టుబడులు దక్కుతాయి. ఈ రేట్లతో పెట్టుబడులు ఎల్లడం కష్టమే.

చిన్న వీరనారాయణ, రైతు, వేపకుంట, కనగానపల్లి మండలం

### రూ. 300పైగా పలికితేనే గిట్టుబాటు

మూడు ఎకరాల్లో పంట సాగు చేశా. ఎకరానికి రూ.లక్షపైగా పెట్టుబడులు పెట్టాను. ముందుసారి ఈ సయమంలో మంచి రేట్లు పలికాయి. గతంలో మాదిరిగానే రేట్లు ఉంటాయని ముందుగా పెట్టాను. అనుకున్నట్లు జరగలేదు. ఇప్పుడు రెండో కటింగ్ పడింది. 190 బాక్సులు అయ్యాయి. 160 బాక్సులు రూ.140తో..మిగిలినవి, రూ.80తో అమ్ముడుపోయాయి. ముందుముందు ధర వస్తుందేమోనని ఎదురుచూస్తున్నా. కనీసం బాక్సు రూ.300 పలికితేనే లాభం ఉంటుంది. ఖర్చుల రూపంలో రూ.100 పోయినా..మిగులులో పెట్టుబడులు పోనూ కాస్త లాభం చేకూరే వీలుంటుంది.

వీరాంజనేయులు, రైతు, పీటీఆర్ పల్లి, కళ్యాణదుర్గం మండలం

### పెట్టుబడి కూడా చేతికిరాదు

మూడు ఎకరాల్లో టమోటా పంట సాగుచేశాను. సుమారు రూ. 3 లక్షల వరకు పెట్టుబడుల ఖర్చు వచ్చింది. 16 కిలోల టమోటా బాక్స్ మొన్నటివరకు రూ. 200 ధర ఉండేది. ఇప్పుడు చాలా తగ్గిపోయింది. ధరలు ఇలాగే ఉంటే పెట్టిన పెట్టుబడుల ఖర్చు కూడా చేతికి అందుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నాం. టమోటా రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

## నిజమైన కామెడీ జాతి రత్నాలు వైసీపీ ఎంపీలు

**--- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**



న్యూఢిల్లీ, నేటి శుభోదయ ::: నిజమైన కామెడీ జాతి రత్నాలు వైసీపీ ఎంపీలు అని, వాళ్లని చూసే సినిమా తీశారేమో అనిపిస్తుందని, వైసిపి ఐదు సంవత్సరాల కాలంలో ఒక్క టీచర్ ఉద్యోగం కూడా ఇవ్వని వాళ్ళు, టీచర్లను మద్యం షాపుల దగ్గర కాపలా పెట్టిన వైసీపీ వాళ్ళు ఈరోజు నారా లోకేష్ గురించి మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందని, ఎప్పుడు శవాలు దొరుకుతాయా ఎప్పుడు శవయాత్రలు చేద్దామా అని చూసే మీకు మేము చేస్తున్న అభివృద్ధి ఏమి కనిపిస్తుందిలే అంటూ, పేపర్ లీకేజీ బిల్లుపై వైసీపీ ఎంపీలు పారిపోతున్నారని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరిఅన్నారు. బుధవారం భారత పార్లమెంట్లో వైసీపీ ఎంపీలు వైఖరిని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి తీవ్రంగా తప్పుపట్టారు. పేపర్ల లీకేజీని అరికట్టే అత్యంత కీలకమైన బిల్లుపై సభలో మాట్లాడాలని కోరితే, వైసీపీ ఎంపీలు ఆ విషయాన్ని వదిలేసి తప్పించుకునే ధోరణితో ఇతర అంశాలపై మాట్లాడుతున్నారని విమర్శించారు. అంతేకాకుండా జంతర్మాంతర్ వద్ద వివిధ పార్టీల ఎంపీలు నిరసనలకు మద్దతు తెలిపినప్పటికీ, వైసీపీ ఎంపీలు మాత్రం ఎందుకు మద్దతు ఇవ్వలేదని ఆమె ప్రశ్నించారు. ప్రస్తుతం ఏపీలో ఆందోళనలు చేస్తున్న వైసీపీ నేతలు కేవలం రాజకీయ నిరుద్యోగులుగా మారారని, ప్రజల సమస్యల కంటే వారి స్వార్థ రాజకీయాలే వారికి ముఖ్యమని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లోక్ సభలో, పార్లమెంట్ బయట మీడియాతో ఎద్దేవా చేశారు.

## ఆగస్టు 17 తర్వాత భోగాపురం నుంచే విమానయానం




విజయనగరం, నేటి శుభోదయ ::: విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఆగస్టు 17 అర్ధరాత్రి 00:01 గంటల నుంచి విమాన రాకపోకలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి షెడ్యూల్ విమానాలను నిలిపేస్తున్నట్లు పౌరవిమానయానశాఖ ప్రకటించింది. 30 ఏళ్లపాటు విశాఖపట్నం ఎయిర్పోర్ట్(ఐఎన్ఎస్ డేగ) సివిల్ ఎన్ క్లేవ్ నుంచి షెడ్యూల్డ్ కమర్షియల్ విమానాల రాకపోకలను నిలిపేస్తున్నట్లు తెలిపింది. జాతీయ అత్యవసర పరిస్థితుల్లో ఈ నిబంధనకు మినహాయింపు ఉంటుందని పేర్కొంది. భారతీయ వాయుసేన, సాయుధ దళాలు, పోలీసు విమానాలు, ప్రభుత్వ అతిథులు రాకపోకలు సాగించే విమానాలు, లీజ్, వీఐపీ ఎయిర్ క్రాఫ్ట్ ఇక్కడి నుంచి నడుస్తాయని, నాన్ షెడ్యూల్డ్ వాణిజ్య కార్యకలాపాలూ కొనసాగుతాయని పేర్కొంది. ఇప్పటి వరకు విశాఖపట్నంఎయిర్పోర్టుకు ఉన్న అంతర్జాతీయ ట్రావెల్ కోడ్ 'వీటీ జెడ్' ఆగస్టు 17 అర్ధరాత్రి 00:01 గంటల నుంచి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి బదిలీ అవుతుందని కేంద్రం తెలిపింది.- అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంగా పేరు జీఎంఆర్ సంస్థ పీపీపీ విధానంలో నిర్మించిన భోగాపురం విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' గా నామకరణం చేస్తున్నట్లు పౌరవిమానయానశాఖ మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ వెలువరించింది. ఈ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని 2024 సెప్టెంబర్ 18న సీఎం అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ఇప్పుడు కేంద్రం దాన్ని అధికారికంగా గుర్తిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది.

## "ఆగస్టు 5న దేవరపల్లి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన విజయవంతం చెయ్యండి వైసిపి ఇన్చార్జి వడ్డీ రఘురామ నాయుడు"



తాడేపల్లిగూడెం జూలై 29 (అవినాష్ మారంపూడి నేటి శుభోదయ):::ఆగస్టు 5వ తేదీన దేవరపల్లి పొగాకు రైతులకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారి దేవరపల్లి పర్యటన విజయవంతం చేయాలని తాడేపల్లిగూడెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వడ్డీ రఘురామ్ నాయుడు నియోజకవర్గం పిలుపునిచ్చారు. బుధవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో నాయకులతో పార్టీ కార్యాచరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను బలంగా ప్రజల తరపున వినిపించి, ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి తీసుకురావడంతో పాటు, పర్యటనను విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నాయకులతో విస్తృతంగా చర్చించారు.రైతుల పక్షాన... ప్రజల పక్షాన... జగనన్నతో కలిసి అడుగులు వేస్తూ దేవరపల్లి సభను 5వ తేదీన పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దేవరపల్లి విచ్చేస్తున్నారని ఆయన పర్యటన విజయవంతం చేయాలని వడ్డీ రఘురామ్ నాయుడు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్క పొగాకు రైతు పార్టీలకతీతంగా తరలివచ్చి ఈ పొగాకు రైతుల పోరు కార్యక్రమాన్ని వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గొర్రెల శ్రీనివాస్, రూరల్ అధ్యక్షుడు చిట్టూరి బాపన్న, పెంటపాడు మండల అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, బూడి ప్రసాద్, లంకా రాజశేఖర్, పచ్చా రామచంద్రయ్య, రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, రెడ్డి శ్రీనివాస్, ఎం.కిరణ్ కుమార్ రెడ్డి, మరియు అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## "కోలాహలంగా నియోజకవర్గ స్థాయి అమరావతి ఛాంపియన్షిప్ క్రీడా పోటీలు"



తాడేపల్లిగూడెం జులై 29 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ)::: తాడేపల్లిగూడెంలో అమరావతి ఛాంపియన్షిప్ క్రీడా పోటీలు స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. జనసేన యువనాయకులు బొలిశెట్టి రాజేష్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల వైపు దృష్టి సారించాలని క్షేత్రస్థాయిలో ప్రతిభను వెలికి తీసేందుకే ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహిస్తుందన్నారు. జనాభాపరంగా అతి చిన్న దేశాలు క్రీడల్లో ముందుగా ఉన్నాయని వాటిని అధిగమించాలంటే యువత క్రీడల వైపు మళ్లాలని సూచించారు. అనంతరం వాలీబాల్, కోకో, కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఉప్పలపాటి శ్రీనివాస్, ఎంపీడీవో వి చంద్రశేఖర్, ఎంఈఓ పిఎంకె జ్యోతి, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, నిలపాల దినేష్ యాదవ్, కోఆర్డినేటర్ బి. శేఖర్ పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలో పేద, బడుగు వర్గాలకు సంక్షేమ పథకాలు

**-రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామప్రసాద్ గౌడ్**



పెనమలూరు, జులై 29 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) కూటమి ప్రభుత్వం వచ్చిన రెండేళ్ల కాలంలో పేద, బడుగు, బలహీన వర్గాల వారికి అందించిన సంక్షేమ పథకాలు, రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, కంపెనీలు, అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం పనులు పై స్థానిక ప్రజలకు ఇంటింటికి తిరిగి పాంప్లెట్ల రూపంలో తెలియచేశామని రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ దేవోలెప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామప్రసాద్ గౌడ్ అన్నారు. బుధవారం యనమలకుదురు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదేశానుసారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు పరిచిందని తెలిపారు.యువ నాయకులు, మంత్రివర్యులు నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలలో ఒక విన్నుతమైన కొత్త ఒరవడికను తీసుకొచ్చి, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు భోజన సదుపాయాలు, టాయిలెట్స్,నాణ్యమైన విద్య మెరుగుపరచటంలో నారా లోకేష్ సఫలీకృతులయ్యారన్నారు.స్థానికంగా రోడ్ల మరమ్మత్తులు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా లాంటి సమస్యలు ఏమైనా ఉంటే స్థానిక శాసనసభ్యులు బోడే ప్రసాద్ తెలియజేయసి తక్షణమే స్పందించి మీ సమస్యలకు పరిష్కారం చూపుతారని హామీ ఇచ్చారు.పెన్షనర్లకు ఒకటో తారీకున ఉదయమే ఇంటికి వచ్చి పెన్షన్లు అందజేస్తున్నారని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇంటికే పెన్షన్ డబ్బులు అందుతున్నాయని స్థానిక ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేశారు.గత జగన్ రెడ్డి ప్రభుత్వంలో అన్ని రకాలుగా ఎన్నో ఇబ్బందులు గురయ్యామని,కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుండి అన్ని సమస్యలు కి పరిష్కార మార్గాలు దొరుకుతున్నాయని, స్థానిక శాసనసభ్యులతో సహా కూటమి నాయకులందరూ అందుబాటులో ఉండి సమస్యలకు పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ అనంతనేని ఆజాద్,రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్ తాడిశెట్టి వీరాస్వామి, ఎడ్లపల్లి సురేష్, చిర్రావూరి శేషు,తాడిశెట్టి ప్రసాద్,తమ్ము అశోక చక్రవర్తి, ఆరేపల్లి శ్రీనివాసరావు, బుంగ బాలస్వామి, కుటమి నాయకులు పాల్గొన్నారు

## గాయపడిన జనసేన వీరమహిళ కనకదుర్గ కు అండగా జనసేన ఇంచార్జి బూరగడ్డ శ్రీకాంత్

**-వైద్య ఖర్చుల కోసం 25వేలు అందించిన జనసేన నాయకులు**



గుడివాడ, జులై 29( అజయ్ నారగాని - నేటి శుభోదయ) రోడ్డు ప్రమాదంలో గాయపడిన కోలుకుంరున్న జనసేన వీరమహిళకు జనసేన నాయకులు అండగా ఉంటామని జనసేన పార్టీ గుడివాడ నియోజకవర్గ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ అన్నారు. బుధవారం గుడివాడ పట్టణంలోని తొమ్మిదో వార్డులో గత వారం రోడ్డు ప్రమాదానికి గురైన జనసేన వీర మహిళ కనకదుర్గకు వైద్యఖర్చుల నిమిత్తం 25 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ వీర మహిళ కనకదుర్గ ఎంతో చురుకుగా అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉండేదని, అనుకోకుండా రోడ్డు ప్రమాదానికి గురైందని, త్వరగా కోలుకుని కుటుంబానికి, పార్టీకి అనేక సేవలు చేయాలని కోరారు. కనదుర్గకు ఎప్పుడు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్జి శ్రీనివాసరావు, సాయిన రాజేష్, సుంకర వెంకట్, షేక్ నాగూర్ బాషా,దాసరి మహేష్, జన్యావుల కిరణ్, సాయి పవన్,వైస్సార్,వెంకటేష్, షేక్ మీరా షరీఫ్, లోయ రాజా, గుండా మహేష్, ప్రసాద్,వీర మహిళలు గేదలకళ్యాణి, శిరీష, కల్పన, నాగరాణి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

## తంటికొండ, గాదెలపాలెంలో ఘనంగా 'కంబాల' కానుక వనితల వేడుక కార్యక్రమం.

**- 1200 మంది మహిళలకు పట్టుచీరలు**

**పంపిణీ చేసిన రామసేన అధ్యక్షుడు 'కంబాల' ...!**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);గోకవరం మండలం తంటికొండ, గాదెలపాలెం గ్రామాలలో మంగళవారం రాత్రి నిర్వహించిన 'కంబాల కానుక వనితల వేడుక' పట్టుచీరలు పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలిత తంటికొండ గ్రామంలో కంబాల శ్రీనివాసరావు అందజేసిన రూ.2 లక్షలు విరాళంతో సత్సంగం భవనం వద్ద నూతనంగా నిర్మించిన కాంపౌండ్ వాల్, షెడ్ ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయనకు ఆయా గ్రామాల మహిళలు హారతులతో స్వాగతం పలికారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, యువత అభిమానులు ఘన స్వాగతం పలికి, పూలమాలలతో సత్కరించారు. ఆయా గ్రామాలలోని ఆలయాలను దర్శించుకుని, పూజలు నిర్వహించి, గ్రామ దేవతలకు తొలి చీరలను సమర్పించారు. ఈ కార్యక్రమానికి రెండు గ్రామాల మహిళల నుంచి విశేషా స్పందన లభించింది. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు తంటికొండ గ్రామంలో 850 మంది మహిళలకు, గాదెలపాలెం గ్రామంలో 350 మంది మహిళలకు ఉచితంగా పట్టుచీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, అభిమానులు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయాలల్లో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



గుడివాడ,పెదపారుపూడి, జులై 29(అజయ్ నారగాని - నేటి శుభోదయ ) గురుపౌర్ణమిని పురస్కరించుకుని పలు సాయిబాబా ఆలయాలల్లో ప్రతేక పూజలు నిర్వహించారు. గుడివాడలోని సాయిబాబా అన్ని ఆలయాలలో అభిషేకాలు, ప్రతేకపూజలు నిర్వహించారు. అలాగే పెదపారుపూడి మండలంలోని పెదపారుపూడి, యలమర్రు, వెంట్రప్రగడ, మోపర్రు, భూషణగుళ్ల గ్రామాలలోని సాయిబాబా ఆలయాలలో ప్రతేక పూజలు చేసి అన్న సమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ సభ్యులు రాధిక, వజ్రమణి, సునీత, చిన్నమ్మడు, లక్ష్మి, హేమలత, యలమర్రులో కాళేశ్వరరావు, సరోజ దంపతులు ప్రతేక పూజలు నిర్వహించి అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## "ఆషాఢ మాస చీరసారే మహోత్సవంలో పాల్గొన్న జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్"



పెంటపాడు జులై 29 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ)::: శ్రీ గౌరీదేవి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన ఆషాఢ మాస చీరసారే మహోత్సవానికి గౌరవ అతిథిగా యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆయన అమ్మవారిని ప్రార్థించారు. శ్రీ గౌరమ్మ దేవి ఆశీస్సులు పెంటపాడు గ్రామ ప్రజలందరికీ ఉండాలని ఆయన ప్రార్థించానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు, ద్వారకాతిరుమల ట్రస్ట్ బోర్డ్ మెంబర్ కసిరెడ్డి మధులత, ముదునూరు సొసైటీ త్రీ మెన్ కమిటీ చైర్మన్ దాసరి అప్పన్న, బండారు వెంకటరావు, జనసేన పార్టీ తాడేపల్లిగూడెం రూరల్ అధ్యక్షులు అడపా ప్రసాద్, నీలపాల దినేష్ యాదవ్, నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డీఎస్సీపై బహిరంగ చర్చకు సిద్ధం -- వైసీపీ నేత పేర్ని నానికి టీడీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి సవాల్



మచిలీపట్నం, జులై 29 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కృష్ణాజిల్లా పెనమలూరు పర్యటన సందర్భంగా డీఎస్సీ నియామకాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న నిరాధార ఆరోపణలకు ఘాటుగా స్పందిస్తూ " జగన్ మోహన్ రెడ్డి బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారని అదే స్ఫూర్తితో వైసీపీ నేత పేర్ని నానికి తాను కూడా బహిరంగ చర్చకు సిద్ధమని తెలుగుదేశం పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి సవాల్ విసిరారు. బుధవారం మచిలీపట్నం పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి "డీఎస్సీపై ఎలాంటి అవకతవకలు జరిగాయని భావిస్తే బహిరంగ చర్చకు రండి. సమయం, వేదిక మీరు నిర్ణయించండి" అని సవాల్ విసిరారని గుర్తు చేశారు."లోకేష్ వరకు ఎందుకు? నేను తెలుగుదేశం పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా, మీరు వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా బహిరంగ చర్చకు రండి. తేదీ, సమయం, వేదిక మీరే నిర్ణయించండి. నేను వచ్చి చర్చకు సిద్ధంగా ఉంటాను" అని గురుమూర్తి స్పష్టం చేశారు.డీఎస్సీ నియామకాల్లో ఎలాంటి అవినీతి జరగలేదని, ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో నియామక ప్రక్రియ నిర్వహించిందన్నారు. వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్ల అమలుపై అధికారులు ఇప్పటికే బహిరంగంగా పూర్తి వివరాలు వెల్లడించారని చెప్పారు. ఆధారాలు లేకుండా అసత్య ప్రచారం చేయడం వల్ల నిజం మారదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 148 రోజుల్లోనే 16,345 మంది యువతకు ఉద్యోగాలు కల్పించడం నారా లోకేష్ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన ఇంటర్మీడియట్ విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకాన్ని "డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం" పేరుతో తిరిగి ప్రారంభించిన ఘనత కూడా నారా లోకేష్ దేనని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో గౌరవించాల్సిన ఉపాధ్యాయులను వైన్ షాపుల వద్ద విధుల కోసం ఉపయోగించిన విషయం రాష్ట్ర ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని దెబ్బతీసిన ఆ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అయితే నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉపాధ్యాయులను సింగపూర్ వంటి దేశాలకు పంపించి ఆధునిక విద్యా విధానాలను అధ్యయనం చేయిస్తున్నారని, ఆ విధానాలను రాష్ట్రంలో అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.గతంలో కృష్ణాజిల్లా నుంచి వెళ్లిపోయిన అశోక్ లేలాండ్ సంస్థను తిరిగి తీసుకురావడంతో పాటు గన్నవరంలోని హెచ్‌సీఎల్ వంటి సంస్థల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు.పేదల బియ్యం అక్రమాలు, నకిలీ భూ పట్టాల వ్యవహారాలపై సమాధానం చెప్పాల్సిన పేర్ని నాని, డీఎస్సీపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.అలాగే 2024 మార్చి 15న ఎమ్మార్వో కార్యాలయంలో జరిగిన నకిలీ భూ పట్టాల వ్యవహారాన్ని కూడా ప్రజలు మరిచిపోలేదని గురుమూర్తి అన్నారు. ఆ రోజు పేదలకు అక్రమంగా భూ పట్టాలు పంపిణీ చేస్తున్నారనే సమాచారంతో నేటి రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఎమ్మార్వో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారని గుర్తు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ విచారణ చేపట్టగా, సంబంధిత పట్టాలపై ఎమ్మార్వో సంతకం లేదని తేలిందన్నారు. నిషేధిత ప్రాంతంలో నకిలీ పట్టాలు సృష్టించి పేదలను మోసం చేసిన వారిపై కోర్టు కూడా తీవ్ర వ్యాఖ్యలు చేసి, ఆ పట్టాలను రద్దు చేయడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు. అలాంటి వ్యవహారాలపై సమాధానం చెప్పాల్సిన పేర్ని నాని, డీఎస్సీపై నిరాధార ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని గురుమూర్తి విమర్శించారు.స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేసిన మంత్రి నారా లోకేష్ ని వ్యక్తిగతంగా విమర్శించడం మానుకుని, వాస్తవాల ఆధారంగా చర్చకు రావాలని సవాల్ విసిరారు.డీఎస్సీపై అసత్య ప్రచారం మానుకోవాలి -- టీడీపీ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ డీఎస్సీ నియామకాలపై వైసీపీ నేత పేర్ని నాని చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని టీడీపీ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ అన్నారు.డీఎస్సీ నియామక ప్రక్రియను ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిందని, అధికారులు ఇప్పటికే అన్ని వివరాలను బహిరంగంగా వెల్లడించారని తెలిపారు. అబద్ధాలను పదేపదే చెప్పడం ద్వారా నిజాలను మార్చలేరన్నారు.

## గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొని బాబా వారికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే రాము,ఎస్డబ్ల్యుసి చైర్మన్ రావిలిశ్రీ

**-బాబా వారిని దర్శించుకున్న వేలాదిమంది భక్తులు**

**-బాబా వారి దీవెనలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి:ఎమ్మెల్యే రాము**



గుడివాడ జులై 29 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) గురువు చూపే మార్గమే జీవితానికి దిశ అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సద్గురు శ్రీ సాయిబాబా కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు.గుడివాడ పట్టణం భీమవరం గేటు వద్ద గల హనుమత్ సమేత శ్రీ దత్త సాయి సేవా సంఘం ఆధ్వర్యంలో గురుపౌర్ణమి పర్వదిన వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి.వేడుకల్లో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఎస్డబ్ల్యుసి చైర్మన్ రావి వెంకటేశ్వరరావు పాల్గొని బాబా వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ గురు పౌర్ణమి పర్వదిన వేడుకల్లో పాల్గొని, స్వామి వారి పాదాలను తాకి పూజలు చేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. బాబా వారి దీవెనలతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో హనుమత్ సమేత శ్రీ దత్త సాయి సేవా సంఘం అధ్యక్షులు వల్లూరుపల్లి లక్ష్మి, టిడిపి నాయకులు లింగం ప్రసాద్, అలయ కమిటీ పెద్దలు దండమూడి సీతారామస్వామి, దండమూడి జయలక్ష్మి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు...

## 'అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞాన జ్యోతిని వెలిగించే గురువు స్థానం అత్యున్నతమైనది..' -- 'నీరుకొండ'

– బురుగుపూడి, కోరుకొండ షిర్డీసాయి ఆలయాల్లో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు. – బాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి సీనియర్ నాయకులు నీరుకొండ వీరన్న చౌదరి



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞాన జ్యోతిని వెలిగించే గురువు స్థానం అత్యున్నతమైనదని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు నీరుకొండ వీరన్న చౌదరి అన్నారు.జీవితానికి దిశానిర్దేశం చేసి, విలువలను నేర్పి, సన్మార్గంలో నడిపించే ప్రతి గురువుకూ ఈ పవిత్ర గురు పౌర్ణమి సందర్భంగా హృదయ పూర్వక ప్రణామాలు తెలియ జేస్తున్నానన్నారు. పవిత్ర గురు పౌర్ణమి పర్వ దినాన్ని పురస్కరించుకుని బుధవారం వీరన్న చౌదరి కోరుకొండ మండలం బురుగుపూడి, కోరుకొండలోని శ్రీ షిర్డీసాయి బాబా ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయనకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. వీరన్న చౌదరి ఈ ఆలయాల్లోని శ్రీ షిర్డీసాయి బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే బురుగుపూడిలో ఆలయ గురువు శ్రీ మామిళ్ల పల్లి రామారావుకు జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. గురువు రామారావుకు పూలమాలలు, శాలువలు వేసి వీరన్న చౌదరి సత్కరించారు. ఆయన ఆశీస్సులు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షుడు కంటే నాగ కేశవరావు, నిర్వాహకులు కంటే గణపతి, ఎన్.వి.ఆర్., వాకచర్ల రామకృష్ణ, హరికృష్ణ, నాగేశ్వరరావు, బ్రిజిలాని, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పార్టీ కంటే ఎవరూ అతీతులు కాదు...

క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

పార్టీ ప్రయోజనాలు, రాష్ట్ర అభివృద్ధే అందరి లక్ష్యం కావాలి

–టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



మంగళగిరి, జూలై 29 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, క్రమశిక్షణే పార్టీకి అతిపెద్ద బలమని, ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త పార్టీ లైన్‌కు కట్టుబడి పనిచేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర పార్టీ వ్యవహారాలపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు అపారమైన విశ్వాసంతో కూటమి ప్రభుత్వానికి చారిత్రాత్మక విజయాన్ని అందించారని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త బాధ్యత అని అన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందని చెప్పారు.గత ఐదేళ్లలో దెబ్బతిన్న వ్యవస్థలను గాడిలో పెట్టి, అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల కల్పన వంటి అన్ని రంగాల్లో ప్రభుత్వం వేగంగా పనిచేస్తోందన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంతో రాష్ట్రం తిరిగి అభివృద్ధి బాటలో పయనిస్తోందని పేర్కొన్నారు.ఈ పరిస్థితుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పల్లా సూచించారు. పార్టీ వల్లే ప్రతి ఒక్కరికీ గుర్తింపు, గౌరవం వచ్చిందనే విషయాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలని అన్నారు. వ్యక్తిగత అభిప్రాయాలు, వ్యక్తిగత ప్రయోజనాల కంటే పార్టీ నిర్ణయాలు, రాష్ట్ర ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.టీడీపీ కార్యకర్తలకు అత్యధిక స్వేచ్ఛ కల్పించే పార్టీ అయినప్పటికీ, ఆ స్వేచ్ఛను పార్టీ ప్రయోజనాలకు విరుద్ధంగా వినియోగించరాదని పల్లా స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణకు విఘాతం కలిగించే చర్యలు ఎవరి నుంచైనా వచ్చినా ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు.కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లే బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని పల్లా తెలిపారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను వినడం, వాటి పరిష్కారానికి కృషి చేయడం ప్రతి కార్యకర్త బాధ్యత అని అన్నారు.రాష్ట్ర అభివృద్ధి, పార్టీ బలోపేతం, ప్రజాసేవ అనే మూడు లక్ష్యాలతో ప్రతి నాయకుడు పనిచేయాలని, పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వంపై విశ్వాసంతో క్రమశిక్షణను పాటిస్తూ ముందుకు సాగితే తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## "ఉద్యానవన విశ్వవిద్యాలయం కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి



తాడేపల్లిగూడెం, జులై 29 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ):::: ఉద్యానవన విశ్వవిద్యాలయ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలను సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తామని, అవసరమైతే కార్మికశాఖకు నివేదిస్తామని ఎఐటియుసి నాయకులు హామీఇచ్చారు.డా. వై.ఎస్.ఆర్. హార్టికల్చర్ యూనివర్సిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం యూనివర్సిటీ ప్రాంగణం వద్ద జరిగింది. సమావేశానికి యూనియన్ అధ్యక్షుడు కోటుం నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు.ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పలు విభాగాల్లో చిరకాలంగా కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ విధానం అమలులో ఉందని, వారికి ఎంత సర్వీసు ఉన్నా పర్మినెంట్ కాకపోగా కనీస వేతనం లభించడం లేదని అన్నారు. ఇచ్చే తక్కువ వేతనాలు కూడా నెలల తరబడి బకాయిలు పెడుతున్నారని అన్నారు. ఉద్యానవన విశ్వవిద్యాలయంలో గతంలో ఆప్ కాస్ లో ఉన్న కొంతమంది సిబ్బందిని కాంట్రాక్ట్ సిబ్బందిగా మార్చడంతో వారి వేతనాలు తగ్గిపోవడం బాధాకరమని అన్నారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎఐటియుసి కృషి చేస్తుందని అన్నారు.ఎఐటియుసి తాడేపల్లిగూడెం ఏరియా సమితి అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ యూనివర్సిటీ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది యూనియన్ ఏర్పాటు చేసుకోవడం, రిజిస్ట్రేషన్ చేయించు కోవడం అభినంద నీయమని , సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ప్రయత్నం చేద్దామని, అవసరమైతే ఉద్యమించడానికి సిద్ధం కావాలని కోరారు. ఏరియా సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా హార్టికల్చర్ యూనివర్సిటీ లోని కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బందిలో కొందరికి గతం కంటే వేతనాలు తగ్గిపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. జీతాలు పెంచకపోగా తగ్గించడం చట్ట విరుద్ధమని అన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి , కార్మికశాఖ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. కార్మికులకు, ఉద్యోగులకు బలమైన కార్మికసంఘం ద్వారా మాత్రమే రక్షణ లభిస్తుందని అన్నారు.ఎఐటియుసి ఏరియా సమితి కార్యదర్శి మందలపర్తి హరీష్, భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాడికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ హార్టీ కల్చర్ యూనివర్సిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ కు తమ సంఘాల తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. యూనియన్ కార్యదర్శి సిద్ధాబత్తుల కృష్ణారావు వందన సమర్పణ చేశారు.

## గురుపూర్ణమి సందర్భంగా షిర్డీ సాయిబాబాను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



అనంత పురం బ్యూరో జూలై 29 నేటి శుభోదయ: గురుపూర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శింగణమల మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి బుక్కరాయసముద్రం మండల పరిధిలోని చెరువు కట్టపై వెలసిన శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ అర్చకులు మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి ప్రత్యేక తీర్థప్రసాదాలు అందించి వేద ఆశీర్వచనాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు



ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రజలందరికీ గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, శ్రీ షిర్డీ సాయిబాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

## ఎలినో ప్రభావంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి

త్రాగునీరు, పశుసంరక్షణ, సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



అనంత పురం బ్యూరో జూలై 29 నేటి శుభోదయ: ఎలినో ప్రభావంతో జిల్లాలో తలెత్తే సమస్యలను ముందుగానే గుర్తించి సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అధికారులను కోరారు.సత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఎలినో ప్రభావంపై సమీక్ష సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పుట్టపర్తి నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.ఎలినో ప్రభావంతో గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చే అవకాశమున్నందున, ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రతి గ్రామంలో తాగునీటి సరఫరా నిరంతరాయంగా ఉండేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.అదేవిధంగా పశువుల ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామాల్లో పశు సంవర్ధక శాఖ అధికారులు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి పశువులకు అవసరమైన స్క్రీనింగ్, చికిత్సలు అందించాలని సూచించారు. పశుసంపదను కాపాడేందుకు అవసరమైన మందులు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.వ్యవసాయ రంగంలో సేంద్రియ వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని, రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రకృతి స్నేహపూర్వక సాగు పద్ధతులపై ప్రోత్సాహం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే భవిష్యత్ తరాల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంపొందించే ఉద్దేశంతో పాఠశాల విద్యార్థులను కూడా సేంద్రియ వ్యవసాయ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని ప్రత్యేకంగా సూచించారు.ఎలినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సమావేశంలో అధికారులు నిర్ణయించారు.

## వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ అమలు చేయాలి

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

జిల్లాలో ఎల్ నినో ప్రభావంపై అధికారులకు దిశానిర్దేశం చేసిన మంత్రి సవితమ్మ




అనంత పురం బ్యూరో జూలై 29 నేటి శుభోదయ : ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులకు బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలో తలెత్తే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు కార్యాచరణ ప్రణాళికను కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా మంత్రి సవితమ్మ అధికారులను ఆదేశించారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, వ్యవసాయం, తాగునీటి నిర్వహణ, ప్రజారోగ్యం, విపత్తు నిర్వహణ తదితర అంశాలపై నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, శాసనమండలి సభ్యులు వై. శివరాం రెడ్డి, కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్, పుట్టపర్తి శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి, జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షపాతం లోపించే అవకాశం ఉన్నందున జిల్లాలో తాగునీటి కొరత, వ్యవసాయ రంగంపై ప్రభావం, ప్రజారోగ్య సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేయాలని, అధికారులను ఆదేశించారు.వ్యవసాయ శాఖ రైతులకు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు విధానాలపై అవగాహన కల్పించాలని, తక్కువ నీటితో సాగు చేసే పంటలను ప్రోత్సహించాలని, విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ అవసరాలు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పశుసంవర్ధక శాఖ పశువులకు తాగునీరు, పచ్చిమేత కొరత లేకుండా తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. . గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని అన్నారు.విపత్తు నిర్వహణలో భాగంగా అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని, ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులను పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని మంత్రి సవితమ్మ పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లాస్థాయి వివిధ శాఖల అధికారులు తమ తమ శాఖల ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను వివరించగా, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి సవితమ్మ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు...



## ప్రగతి మార్గంలో కూటమి ప్రభుత్వం..! దుర్గి,ఓబులేసునిపల్లెలో ఇంటింటికీ తెలుగుదేశం..!



దుర్గి: ఆర్ సి ఇన్చార్జి జూలై 29; నేటి శుభోదయ :రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి, సంక్షేమం ప్రగతి మార్గంలో దూసుకెళ్లిందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పునరుద్ఘాటించారు. బుధవారం మండల కేంద్రం, ఓబులేసునిపల్లె గ్రామంలో ఎమ్మెల్యే జూలకంటి ఇంటింటికీ తెలుగుదేశం, ప్రతి ఇంటికీ జూలకంటి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా మండల కేంద్రంలో ప్రారంభించిన ప్రచార కార్యక్రమంలో ప్రజలు, కూటమి పార్టీల శ్రేణులు జూలకంటికి ఘనంగా స్వాగతం పలికారు. భారీ ర్యాలీ నడుమ పాత శివాలయం సెంటర్, బ్రాహ్మణ వీధి, పోతురాజుగడ్డ, యాదవ బజారు నందు ఇంటింటికీ ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం, నియోజకవర్గం,మండలం పరిధిలో సాధించిన ప్రగతిని, అందించిన సంక్షేమాన్ని ఎమ్మెల్యే వివరించారు. అనంతరం ఓబులేసుని పల్లెలో బీసీ, ఎస్టీ కాలనీలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. దుర్గి మండలం పరిధిలో దాదాపు వందల కోట్లతో అభివృద్ధి, సంక్షేమాలకు నిధులు కేటాయించామని చెప్పారు. రెండేళ్లలో దుర్గి గ్రామ పంచాయతీ పరిధిలో రూ.7 కోట్ల 25 లక్షల,58 వేలను అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చుపెట్టామని చెప్పారు. అలానే ఓబులేసునిపల్లె గ్రామంలో రూ.16 కోట్ల 31 లక్షలు ఖర్చు చేశామని వెల్లడించారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమం, అన్నీ ప్రాంతాల అభివృద్దే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సుపరిపాలన సాగిస్తోందని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యేచూరి సాయి శంకర్, దుర్గి మార్కెట్ యార్డ్ చైర్మన్ లింగా బ్రహ్మయ్య, మండల పార్టీ అధ్యక్షులు జానికిరామయ్య, పార్టీ నాయకులు లింగా రమేష్, చిరుమావిళ్ల క్రిష్టయ్య, మాగులూరి నారారాయణ, మారుగుండ్ల వేణుగోపాల్, పసుమర్తి బుజ్జి, సింగు నాగేశ్వరావు, యాగంటి నరేష్, ఉన్నం మహేష్ ఎల్లబోయిన గోపాల్, తోట వీరయ్య, ఎల్లబోయిన రాంబాబు, రుద్రాల రవి, వెలిదండి శ్రీను, దిగుమర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## పోస్టల్ సేవలపై జీఎస్టీ తొలగించాలని కేంద్రానికి ఎంపీ వల్లభనేని బాలశౌరి విజ్ఞప్తి



న్యూఢిల్లీ, మచిలీపట్నం, జులై 29 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ,) మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి లోక్‌సభలో పోస్టల్ సేవలపై విధిస్తున్న జీఎస్టీకి సంబంధించిన అంశాన్ని ప్రస్తావించారు. సాధారణ తపాలా సేవలకు జీఎస్టీ మినహాయింపు ఉన్నప్పటికీ, స్పీడ్ పోస్ట్‌తో పాటు ఇతర పోస్టల్ సేవలపై జీఎస్టీ ఎందుకు విధిస్తున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.దీనికి కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ సమాధానమిస్తూ, ప్రస్తుతం పోస్ట్‌కార్డులు, ఇన్‌ల్యాండ్ లెటర్లు, బుక్‌పోస్ట్, 10 గ్రాముల లోపు సాధారణ తపాలా కవర్లు వంటి సేవలకు మాత్రమే జీఎస్టీ మినహాయింపు ఉందని తెలిపారు. అదేవిధంగా, తపాలా శాఖ అందిస్తున్న జీవిత బీమా సేవలు కూడా జీఎస్టీ నుంచి మినహాయింపులో ఉన్నాయని వెల్లడించారు. అయితే, స్పీడ్ పోస్ట్‌తో పాటు మినహాయింపు జాబితాలో లేని ఇతర పోస్టల్ సేవలన్నీ జీఎస్టీ పరిధిలోకి వస్తాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ, ప్రజలకు తక్కువ వ్యయంతో సేవలు అందించే భారత తపాలా శాఖపై జీఎస్టీ భారం తగ్గించడం అవసరమన్నారు. ప్రైవేట్ కొరియర్ సంస్థలతో పోటీ పడేందుకు స్పీడ్ పోస్ట్ సహా మరిన్ని పోస్టల్ సేవలకు జీఎస్టీ మినహాయింపు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందిస్తూ, స్పీడ్ పోస్ట్ (ఈఎంఎస్), అంతర్జాతీయ పోస్టల్ సేవలు, దేశీయ బుక్ ప్యాకెట్లు, రిజిస్టర్డ్ వార్తాపత్రికలు, 20 గ్రాముల వరకు లేఖలు తదితర సేవలకు జీఎస్టీ మినహాయింపు కల్పించాలని తపాలా శాఖ ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని సీబీఐసీకి పలుమార్లు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించింది.మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తడం ద్వారా ప్రజలకు, చిన్న వ్యాపారులకు మరియు తపాలా సేవలను వినియోగించే లక్షలాది మందికి ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు.

## ప్రతి ఇంటికీ మంచి చేయడమే ప్రభుత్వ ధ్యేయం..!

టీడీపీ యువ నాయకులు గౌతమ్ జూలకంటి



మాచర్ల మండలం: ఆర్ సి ఇన్చార్జి జూలై 29; నేటి శుభోదయ :ప్రతి ఇంటికీ మంచి చేయడమే ధ్యేయంగా పెట్టుకుని కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన సాగిస్తూ ముందుకు వెళ్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయులు, టీడీపీ యువ నాయకులు గౌతమ్ జూలకంటి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చింతలతండా, చెంచుకాలనీ, కంభంపాడు గ్రామాల్లో ఇంటింటికీ తెలుగుదేశం.., ప్రతి ఇంటికీ జూలకంటి ప్రచార కార్యక్రమాన్ని గౌతమ్ చేపట్టారు. గ్రామాల్లో పర్యటించేందుకు విచ్చేసిన గౌతమ్ కు ప్రజలు, కూటమి పార్టీల శ్రేణులు సాదరంగా ఆహ్వానించాయి. అనంతరం ప్రతి ఇంటికీ తిరిగి రాష్ట్రం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని, చేపడుతున్న అభివృద్ధి పనులు గురించి వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ.., ప్రచారంలో ముందుకు సాగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాచర్ల మండలం దశాబ్దాలుగా మరుగున పడిన అభివృద్ధి నేడు ఎమ్మెల్యే జూలకంటి హయంలో పరుగులు పెడుతోందని చెప్పారు. మాచర్ల మండల టీడీపీ అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్,వజ్రం నాయక్,రమావత్ రాజ్ కుమార్,స్వామి నాయక్,హరి,బావోసింగ్,బాబూరావు,శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## వెల్దుర్తిలో ఇంటింటికీ తెలుగుదేశం..!





వెల్దుర్తి : ఆర్ సి ఇన్చార్జి జూలై 29 ;నేటి శుభోదయ :తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు వెల్దుర్తి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ నుంచి జూలకంటి శోభారాణి ఇంటింటింకీ తెలుగుదేశం ప్రచారం ప్రారంభించారు. కూటమి ప్రభుత్వంలో రెండేళ్ల పాలనలో జరిగిన మంచిని ప్రజలకు వివరించారు. సాధించిన ప్రగతి కర పత్రాలను ప్రజలకు అందించారు. రెండు దశాబ్ధాలు చూడని అభివృద్ధిని ఈ రెండేళ్లల్లో ప్రజలు చూస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పులుసు శివారెడ్డి, యువ నాయకులు జూలకంటి అక్కిరెడ్డి, కోట్ల శ్రీనివాసరెడ్డి, జూలకంటి వెంకటరెడ్డి, పులుసు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సింహాచలం గిరి ప్రదక్షిణలో అధికారుల మధ్య తీవ్ర సమన్వయ లోపం

**- భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం - ఫలితంగా అడుగడుగునా ఇబ్బంది పడ్డ భక్తజనంకూటమి ప్రభుత్వ తీరుపై మండిపడ్డ వైయస్సార్సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కే కే రాజు**

**- విశాఖపట్నం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన విశాఖ జిల్లా అధ్యక్షుడు కే కే రాజు.**



( నేటి శుభోదయ జులై : 30 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖ సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి గిరి ప్రదక్షిణ మహోత్సవంలో కూటమి ప్రభుత్వం, పోలీసు, దేవాదాయ, రెవెన్యూ మరియు జీవీఎంసీ యంత్రాంగాల మధ్య తీవ్ర సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనపడిందని, అధికారుల చేతకానితనం వల్ల లక్షలాది మంది భక్తులు, నగర ప్రజలు ప్రత్యక్ష నరకం చూశారని వైఎస్సార్సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కే కే రాజు తీవ్రంగా విమర్శించారు. విశాఖలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన... ప్రచార ఆర్భాటాలకు, రివ్యూ మీటింగులకే పరిమితమైన నాయకులు భక్తుల కనీస వసతులు, ట్రాఫిక్ ఆంక్షలపై ముందస్తు ప్రణాళికలు రూపొందించడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. గిరి ప్రదక్షిణ విశిష్టతను, సాంప్రదాయాలను దెబ్బతీస్తూ పండితుల పేరిట గందరగోళం సృష్టించడం అత్యంత విచారకరమని ఆందోళన వ్యక్తం చేశారు. నిన్నటి మహోత్సవంలో జరిగిన అవకతవకలు, అధికారుల నిర్లక్ష్యం మరియు నిధుల దోపిడీపై తక్షణమే ఉన్నత స్థాయి ఎంక్వయిరీ జరిపించి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### శాఖల మధ్య సమన్వయ లోపం

### -- భక్తులకు ప్రత్యక్ష నరకం.

నిన్న జరిగిన శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి గిరి ప్రదక్షిణ సందర్భంగా భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. దేవాదాయ ధర్మాదాయ శాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ మరియు జీవీఎంసీ యంత్రాంగాల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా బయటపడింది. గిరి ప్రదక్షిణకు సంబంధించి నగర ప్రజలకు కానీ, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు కానీ ట్రాఫిక్ ఆంక్షల పట్ల ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదు. కేవలం ప్రచార ఏర్పాట్లకు పరిమితమై, ఎంతమంది భక్తులు వస్తారనే కనీస అంచనా వేయకుండా ఏదో మొక్కుబడిగా ఏర్పాట్లు చేశారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల లక్షలాది మంది భక్తులతో పాటు నగర ప్రజలందరూ తీవ్ర ఇబ్బందులు పడటం చాలా దురదృష్టకరం.

### మంత్రుల ఆర్భాటాలు

### -- ముందస్తు ప్రణాళికా రాహిత్యం..

గిరి ప్రదక్షిణ అనేది నిన్న మొన్న ప్రారంభమైనది కాదు. వందలాది సంవత్సరాలుగా అత్యంత పవిత్రంగా జరుగుతున్న సాంప్రదాయ కార్యక్రమం. ఇలాంటి పవిత్రమైన యాత్రకు ప్రభుత్వాలు ముందస్తు ప్రణాళికతో ఎంతమంది భక్తులు వస్తారో అంచనా వేసి తదనుగుణంగా సౌకర్యాలు కల్పించాలి. కానీ ఈ కూటమి ప్రభుత్వం అందులో పూర్తిగా విఫలమైంది. ఇక్కడున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు గిరి ప్రదక్షిణకు నాలుగు రోజుల ముందు ఏదో తూతూమంత్రంగా రివ్యూలు చేయడం, హడావుడి చేయడం, పబ్లిసిటీ చేసుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చారు తప్ప భక్తుల సౌకర్యాల గురించి ఆలోచించలేదు. నిన్న సాయంత్రం 3:30, 4:00 గంటలకే భక్తులు భారీగా తరలివస్తున్నారని తెలిసినా ఏ ఒక్క అధికారీ పట్టించుకోలేదు".

### సాంప్రదాయాల ఉల్లంఘన

### -- తొలి పావంచా గందరగోళం

"తమ స్వార్థ ప్రచారం కోసం, 'ఇన్ని లక్షల మంది వచ్చారు' అని గొప్పలు చెప్పుకోవడం కోసం వందల సంవత్సరాలుగా వస్తున్న సాంప్రదాయాలను కూడా పక్కన పెట్టారు. సింహాచలం గిరి ప్రదక్షిణ అంటే తొలి పావంచా వద్ద కొబ్బరికాయ కొట్టి, సంకల్పం చెప్పుకొని 32 కిలోమీటర్లు పాదయాత్ర చేసి స్వామివారిని దర్శించుకోవడం ఆచారం. కానీ హోం మంత్రి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, స్థానిక నాయకులు ప్రెస్ మీట్ పెట్టి 'ఆరు చోట్ల తొలి పావంచాలు ఏర్పాటు చేశాం, ఎక్కడి నుంచైనా ప్రారంభించవచ్చు' అని చెప్పడం ఎంతవరకు సమంజసం? తొలి పావంచా విశిష్టతను, భక్తుల నమ్మకాలను దెబ్బతీస్తూ ప్రజలను కన్ఫ్యూజ్ చేశారు. హోం మినిస్టర్ ధర్మశాస్త్రాలు చెప్పడం ఏమిటి? ఆచారాలు మార్చాలంటే ఆలయ పండితులు చెప్పాలి తప్ప రాజకీయ నాయకులు నిర్ణయించడం ఏమిటి?.

### దేవాదాయ శాఖ మంత్రి నిర్లక్ష్యం

### -- సింహగిరిపై ద్రోహం..

దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి గారు ఏమైనా మౌనవ్రతంలో ఉన్నారా? గతంలో చందనోత్సవంలో ఘటనలు జరిగినప్పుడు కూడా ఆయన సరిగ్గా స్పందించలేదు. ఇంత పెద్ద పవిత్రమైన కార్యక్రమం జరుగుతుంటే పక్కనబెట్టి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం విచారకరం. టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిపై చిన్నచూపే. గతంలో పవిత్రమైన సింహగిరి ప్రాంతంలో సెంట్రల్ జైలు, ఆర్టీసీ డిపోలు తీసుకొచ్చి పెట్టారు. ఇప్పుడు గూగుల్ డేటా సెంటర్ పేరుతో గుడికి కూతవేటు దూరంలో ఉన్న 160 ఎకరాల స్వామివారి పవిత్ర భూములను కేటాయించారు. మీరు చేస్తున్న అన్యాయాలకు, ద్రోహానికి స్వామి వారిని వేడుకుని క్షమాపణ చెప్పకపోతే, లక్ష్మీ నరసింహ స్వామి ఉగ్రరూపానికి కూటమి నాయకులు బలికాక తప్పదు.

జీవీఎంసీ దోపిడీ -- నీళ్లు ఇవ్వలేని అసమర్థత..

32 కిలోమీటర్లు సుదీర్ఘంగా పాదయాత్ర చేసే భక్తులకు కనీసం తాగునీరు కూడా అందించడంలో జీవీఎంసీ మరియు ప్రభుత్వ యంత్రాంగం దారుణంగా విఫలమైంది. అధికారులు, జీవీఎంసీ కమిషనర్ కేవలం తమ రాజకీయ నాయకుల ప్రోటోకాల్స్, దర్శనాలకే పరిమితమయ్యారు తప్ప ప్రజల సంక్షేమం పట్టించుకోలేదు. టెండర్లు, అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టుల పేరుతో డబ్బులు దండుకోవడం, దోపిడీ చేయడంపైనే దృష్టి పెట్టారు. నిన్నటి కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు, చారిటబుల్ ట్రస్టులు మరియు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా వాలంటీర్లుగా మారి నీళ్లు, సేవలు అందించబట్టే పరిస్థితి కొద్దిగా సర్దుమనిగింది. లేకపోతే పరిస్థితి మరింత భయానకంగా ఉండేది. చివరికి పచ్చ పత్రికల్లో కూడా నిన్నటి ప్రత్యక్ష నరకంపై కథనాలు వచ్చాయంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

### వైఎస్సార్సీపీ ప్రధాన డిమాండ్లు:

ఈ నేపథ్యంలో నిన్నటి గిరి ప్రదక్షిణ నిర్వహణలో విఫలమైన ప్రభుత్వ యంత్రాంగం, జీవీఎంసీ, పోలీసు మరియు దేవాదాయ శాఖల నిర్లక్ష్యంపై తక్షణమే ఉన్నత స్థాయి విచారణ (ఎంక్వయిరీ) జరిపించి, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులను, దోపిడీకి పాల్పడిన బాధ్యులను కఠినంగా శిక్షించడంతో పాటు, సింహాచలం స్వామివారి విషయంలో చేసిన అపరాధానికి కూటమి ప్రభుత్వం భక్తులకు, ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కే కే రాజు డిమాండ్ చేశారు.

## యాడికి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఘనంగా రమా సత్యనారాయణ స్వామి వ్రతాలు



యాడికి జూలై 29 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : పట్టణంలోని శ్రీ శ్రీ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాలలో ఆషాఢ మాసం గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ రమా సత్యనారాయణ స్వామివారి అభిషేకాలు, వ్రత మహోత్సవం అత్యంత వైభవంగా జరిగాయి. ప్రతి నెలా పౌర్ణమి సందర్భంగా నిర్వహించే పూజల్లో భాగంగా, గురు పౌర్ణమి నాడు ఆలయ ప్రాంగణంలో భక్తి వాతావరణం వెల్లివిరిసింది. వేద పండితులు బట్టు స్వామి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా, శాస్త్రోపవేతంగా ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని సత్యనారాయణ స్వామి వ్రతాలను



నోచుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. యాడికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుకలన్నింటినీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అత్యంత ఘనంగా ఏర్పాటు చేశారు..

## కేంద్రం సహకారంతో శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయాన్ని ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుదాం

**లోక్‌సభలో నియమం-377 కింద విజయవాడ ప్రజల ఆకాంక్షలను పార్లమెంట్ వేదికగా ప్రతిపాదించిన ఎంపీ కేశినేని చిన్ని**




విజయవాడ, జూలై 29 (నేటి శుభోదయ):-పార్లమెంట్ లో భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఇంద్రకీలాద్రి పై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఆలయం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) లోక్‌సభలో కోరారు. తిరుపతి తరువాత అత్యంత ప్రాధాన్యత, భక్తుల తాకిడి కలిగిన విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయం పై బుధవారం జరిగిన లోక్‌సభ సమావేశంలో నియమం-377 కింద ప్రత్యేక అంశాన్ని ఎంపీ చిన్ని ప్రతిపాదించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన శాశ్వత మౌలిక సదుపాయాలు, యాత్రికుల సౌకర్యాల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.కృష్ణా నది తీరాన ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయం శతాబ్దాల చరిత్ర కలిగిన పవిత్ర శక్తిపీఠమని ఎంపీ పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం కోట్లాది మంది భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తున్న ఈ ఆలయం ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యంత ప్రాచుర్యం పొందిన దేవాలయాల్లో ఒకటిగా నిలిచిందన్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, శ్రీదేవి అలంకారాలు, తెప్పోత్సవం, భవానీ దీక్షల సందర్భంగా దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు ఇక్కడికి తరలివస్తున్నారని తెలిపారు. ప్రతిరోజూ సుమారు 50 వేల మంది, పండుగల సమయంలో రెండు లక్షలకు పైగా భక్తులు ఆలయాన్ని సందర్శిస్తున్నారు. అదే స్థాయిలో శాశ్వత మౌలిక వసతులు కూడా కల్పించాలి అని కేంద్రానికి సూచించారు. ఆలయ సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం కింద ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎంపీ శివనాథ్ డిమాండ్ చేశారు.ఆ నిధులతో బహుళ అంతస్తుల కార్ పార్కింగ్ నిర్మాణం, విశాలమైన బహుళ అంతస్తుల వెయిటింగ్ హాల్, ఆధునిక యాత్రికుల సౌకర్య కేంద్రాలు, రద్దీని తగ్గించే రహదారుల విస్తరణ, ట్రాఫిక్ నిర్వహణకు శాశ్వత ప్రణాళిక, పరిశుభ్రమైన తాగునీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి కేంద్రాలు, డిజిటల్ సమాచార కేంద్రాలు, భక్తుల సౌకర్య సేవలు,వంటి సౌకర్యాలను అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లలతో వచ్చే కుటుంబాలు కొండపై ఉన్న ఆలయానికి సులభంగా చేరుకునేందుకు పర్వతమాల పథకం కింద ఆధునిక రోప్‌వే వ్యవస్థను ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ కోరారు. రోప్‌వే ద్వారా ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు భక్తుల ప్రయాణం వేగవంతం, సురక్షితంగా మారుతుందని తెలిపారు. వారణాసి, అయోధ్య వంటి పుణ్యక్షేత్రాల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచాయని గుర్తు చేసిన ఎంపీ, అదే తరహాలో శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయాన్ని కూడా ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ అభివృద్ధి వల్ల విజయవాడలో పర్యాటక రంగం విస్తరించడంతో పాటు హోటళ్లు, రవాణా, చిన్న వ్యాపారాలు, స్థానిక కళాకారులు, యువతకు ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు. శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ అభివృద్ధి కేవలం ఆధ్యాత్మిక రంగానికే పరిమితం కాకుండా విజయవాడ నగర ఆర్థిక వ్యవస్థకు కూడా కొత్త ఊపునిస్తుందని ఎంపీ పేర్కొన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే యాత్రికుల సంఖ్య మరింత పెరిగి స్థానిక వ్యాపారాలు, పర్యాటక రంగం, సేవా రంగం అభివృద్ధి చెందుతాయని చెప్పారు.విజయవాడ ప్రజల ఆకాంక్ష గా ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ సమగ్ర అభివృద్ధి అంశాన్ని లోక్‌సభ దృష్టికి తీసుకువచ్చానని ఎంపీ శివనాథ్ తెలిపారు. భక్తులకు అన్ని విధాలా మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆలయ ప్రతిష్ఠను మరింత పెంచడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయానికి అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం ప్రసాద్ పథకం కింద ప్రత్యేక నిధులు, పర్వతమాల పథకం కింద రోప్‌వేకు ఆమోదం తెలుపుతూ కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిర్ణయం చేశారు.

## యాడికి శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయంలో ఘనంగా ఆషాఢ పౌర్ణమి పూజలు





యాడికి జూలై 29 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : పట్టణంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆషాఢ మాసం గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా తెల్లవారుజామున సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి, అనంతరం శాస్త్రోక్తంగా గంగపూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి నూతన పట్టు వస్త్రాలు సమర్పించి, విశేషంగా అలంకరించిన పిమ్మట వేద పండితుల ఆధ్వర్యంలో కుంకుమార్చన, మహామంగళహారతి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనార్థం విచ్చేసిన భక్తులకు ఆలయ ప్రాంగణంలో అల్పాహారం, తీర్థప్రసాదాల వితరణ చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలన్నింటినీ యాడికి శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అత్యంత ఘనంగా నిర్వహించారు...

## జులై 31తో ముగియనున్న పంటల బీమా గడువు

**రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఏఓ విజ్ఞప్తి**



యాడికి జూలై 29 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల పరిధిలోని రైతు సోదరులందరూ అన్ని రకాల పంటలకు వెంటనే పంటల బీమా చేసుకోవాలని, ఈ అవకాశానికి ఈ నెల 31వ తేదీయే చివరి గడువని మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో 'ఎల్ నినో' ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉనందున, పంట నష్టపరిహారం (బీమా) పొందే అవకాశాలు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు.?ముఖ్యంగా వాతావరణ ఆధారిత పంటల బీమా కింద వేరుశనగ, పత్తి పంటలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. వచ్చే రెండు రోజులు మాత్రమే సమయం ఉన్నందున, రైతులెవరూ ఆలస్యం చేయకుండా వెంటనే నమోదు చేసుకోవాలని కోరారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలకు నష్టం వాటిల్లినా బీమా ద్వారా ఆర్థిక రక్షణ లభిస్తుందని, కావున మండలంలోని రైతు సోదరులందరూ గడువు ముగిసేలోగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు..

## శ్రీ జగన్మాత సన్నిధిలో కొనసాగుతున్న రద్దీ



విజయవాడ, జూలై 29 (నేటి శుభోదయ):-శ్రీ కనకదుర్గమ్మ వారిని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో ఇంద్ర కీలాద్రికి ఆషాఢ సారె 16వ రోజు తో పాటు, శా కంభరి ఉత్సవాలు సందర్భంగా గురువారం శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా భక్తులతో రద్దీ విపరీతంగా పెరిగింది.- సాయంత్రం 5 గంటల వరకు 28 సారె బృందాలు రాగా 14120 మంది భక్తులు సారె ను సమర్పించారు. సారె బృందాలకు ఉచిత దర్శనంతో పాటు, కదంభం దేవస్థానం వారు ప్రసాదాలను అందజేశారు.

## ప్రజల విశ్వాసమే కూటమి ప్రభుత్వానికి బలం గద్దె క్రాంతి కుమార్



విజయవాడ, జూలై 29 (నేటి శుభోదయ):- 'ఇంటింటికి కూటమి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా తాము ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరినీ కలిసి ఈ ప్రభుత్వం వారికి అందించిన సంక్షేమ కార్యక్రమాలు గురించి తెలుసుకుంటూ ఈ ప్రభుత్వం పై వారి అభిప్రాయాన్ని తెలుసుకుంటున్నామని, ప్రతి ఒక్క కుటుంబం కూడా కూటమి ప్రభుత్వంపై విశ్వాసంతో ఉన్నట్లుగా తెలియజేస్తున్నారని, ఇదే ప్రభుత్వ బలమని గద్దె క్రాంతి కుమార్ తెలిపారు.బుధవారం ఉదయం 'డోర్ టూ డోర్' కార్యక్రమంలో భాగంగా 20వ డివిజన్ లో టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ పర్యటించారు. అక్కడి స్థానికుల ఇంటింటికీ వెళ్లి, స్వయంగా కలిసి 'రెండేళ్ల అభివృద్ధి -- సంక్షేమం -- నమ్మకం' పేరుతో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేసి, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి మాట్లాడుతూ రెండేళ్లలో అభివృద్ధి, సంక్షేమం సమన్వయంతో ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళల సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ వారి ఆర్థికాభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, యువతకు ఉద్యోగాలు, పెట్టుబడులు తీసుకురావడంలో ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాల్లో మెరుగైన సేవలు, మౌలిక వసతుల కల్పనతో పాటు రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ వంటి సౌకర్యాల అభివృద్ధి రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతోందన్నారు. పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని క్రాంతి కుమార్ అన్నారు. ఇంటింటి కార్యక్రమం ద్వారా ప్రజల సూచనలు, అభిప్రాయాలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, డివిజన్ పార్టీ అధ్యక్షుడు గళ్లా శ్రీను, చింతా వెంకటేశ్వరరావు, కొడాలి సాయిబాబు, వన్నెంరెడ్డి రాధ, గళ్లా సుబ్బారావు ఇంకా బూత్, క్లస్టర్ ఇన్చార్జిలు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం..!!

**- త్వరలోనే అటాక్స్ కమిటీలు నియామకం - రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు.. గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి - 11 డిమాండ్లపై వినతిపత్రం సమర్పించిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్**



( నేటి శుభోదయ జులై : 30 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) డాబా గార్డెన్స్ రాష్ట్రంలో జర్నలిస్టులు పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు ..గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేందుకు వీలైనంత త్వరలో తగు చర్యలు తీసుకుంటారన్నారు.. ఇప్పటికే జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు పై ప్రభుత్వం అధ్యయనం చేస్తుందని పేర్కొన్నారు.. ఇక త్వరలో అటాక్స్ కమిటీలు నియమించడం జరుగుతుందన్నారు.. తాజాగా ఈ ఫైల్ ను సిద్ధం చేస్తున్నామన్నారు ఇటీవల అమరావతిలో జర్నలిస్టులకు సంబంధించిన ఇళ్ల స్థలాల ఫైల్ పరిశీలన నిమిత్తం సంబంధిత అధికారులకు పంపించా మన్నారు..బుధవారం డాబా గార్డెన్స్ వి జె ఎఫ్ (వైజాగ్ జర్నలిస్టులు ఫోరం) ప్రెస్ క్లబ్ లో మంత్రి కొలుసు పార్థ సారథిను ఏపీ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్.. బ్రాడ్ కాస్ట్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకుని 11 పెండింగ్ డిమాండ్లకు సంబంధించి వినతి పత్రం అందజేశారు.. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.. త్వరలోనే ఆయా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు.. ప్రభుత్వం జర్నలిస్టులకు అండగా ఉంటుందన్నారు..జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ..ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు.. విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణ లు మంత్రిని కలిసిన అనంతరం మాట్లాడుతూ జర్నలిస్టులకు సంబంధించిన 11 డిమాండ్లపై మంత్రికి వినతి పత్రం సమర్పించామని ఈనెల 31న రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల డిమాండ్స్ డే ని పాటిస్తున్నామన్నారు.... రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల కలెక్టర్లు ఇతర ముఖ్య అధికారులు ప్రజాప్రతినిధులకు తమ సభ్యులు వినతి పత్రాలు అందజేసి డిమాండ్స్ డే ను జయప్రదం చేయనున్నట్లు చెప్పారు.. వీలైనంత త్వరలో జర్నలిస్టులు సమస్యలు పరిష్కారం కావాలన్నదే ఫెడరేషన్ ముఖ్య లక్ష్యంగా చెప్పారు.. అనంతరం మంత్రి పార్థసారథిని జర్నలిస్టులు ఘనంగా సత్కరించగా గంట్ల శ్రీనుబాబు సింహాద్రి నాథుడి జ్ఞాపికను బహుకరించారు..ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాసరావు..ఆర్గనైజింగ్ సెక్రటరీ డి..రవికుమార్.. కార్యవర్గ సభ్యుడు బొబ్బర ప్రసాద్.. బ్రాడ్ కాస్ట్ అధ్యక్ష కార్యదర్శులు ఇరోతి ఈశ్వర్ రావు.. కింతాడ మదన్.. స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్. హరి.. ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు

## గురుపౌర్ణమి వేళ సాయినాథుడికి విశేష పూజలు



పులిచెర్ల, జులై 29,(నేటి శుభోదయ) :గురుపౌర్ణమి సందర్భంగా పులిచెర్లలోని శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పాలాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేదమంత్రోచ్చారణల నడుమ అర్చనలు, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గురుపౌర్ణమి పురస్కరించుకుని పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చి సాయిబాబాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు "ఓం సాయి.. శ్రీ సాయి.. జయ జయ సాయి.." అంటూ భక్తిగీతాలు ఆలపించగా, ఆలయం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

జనరల్ న్యూస్

గురువారం -30- జులై - 2026

## గ్రీన్ హైడ్రోజన్ వాహనాల అభివృద్ధికి కేంద్రం వేగవంతమైన చర్యలు. ఆంధ్రప్రదేశ్‌కు విశాఖపట్నం

**--బయ్యవరం మార్గంలో పైలట్ ప్రాజెక్టు**



విజయవాడ, జూలై 29 (నేటి శుభోదయ):పార్లమెంట్ లో దేశంలో గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత రవాణా వ్యవస్థను అభివృద్ధి చేసి, స్వచ్ఛ ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని లోక్‌సభలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం సమాధానం ఇచ్చింది .లోక్‌సభలో నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖకు ఎంపీ కేశినేని శివనాథ్ హైడ్రోజన్ ఆధారిత వాహనాలు, హైడ్రోజన్ ఇంధనం నింపే స్టేషన్లు, రాష్ట్రాల వారీగా ఆమోదించిన ప్రాజెక్టులు, వాటికి కేటాయించిన నిధులు, అలాగే గ్రీన్ హైడ్రోజన్ వాహనాల పనితీరు, భద్రత, మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం అనుసరిస్తున్న పర్యవేక్షణ వ్యవస్థ గురించి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.దీనికి కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన, విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద యెస్సో నాయక్ సమాధానం ఇస్తూ, జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కింద దేశాన్ని గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, వినియోగం, ఎగుమతుల్లో ప్రపంచ అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను అమలు చేస్తోందని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో 21 మార్గాల్లో 16 హైడ్రోజన్ రీఫ్యూయలింగ్ స్టేషన్లతో పాటు మొత్తం 70 హైడ్రోజన్ ఆధారిత వాహనాల నిర్వహణకు 12 పైలట్ ప్రాజెక్టులు మంజూరు చేశారు. వీటిలో 27 హైడ్రోజన్ బస్సులు, 43 హైడ్రోజన్ ట్రక్కులు ఉన్నాయి. ఇవి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ ఎలక్ట్రిక్ వాహనాలు, హైడ్రోజన్ ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్, సాంకేతికతలతో నడుస్తాయియని,ఈ ప్రాజెక్టుల అమలుకు కేంద్ర ప్రభుత్వం మొత్తం రూ.410.77 కోట్లు ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయగా, ఇప్పటివరకు రూ.41.582 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు.రెండో దశలో కూడా మరిన్ని ప్రాజెక్టులను ఆమోదించి, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో అదనపు హైడ్రోజన్ బస్సులు, ట్రక్కులను ప్రయోగాత్మకంగా నడపనున్నట్లు తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి విశాఖపట్నం -- బయ్యవరం మార్గంలో కన్సార్టియం ద్వారా 40 టన్నుల హైడ్రోజన్ ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్, ట్రక్ పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో హైడ్రోజన్ ఆధారిత భారీ వాణిజ్య వాహనాల వినియోగానికి నాంది పలకనుందని, అంతేకాకుండా, గ్రీన్ హైడ్రోజన్ వాహనాల పనితీరు, ఇంధన వినియోగ సామర్థ్యం, భద్రతా ప్రమాణాలు, నిర్వహణ వ్యయం, వినియోగ అనుభవం వంటి అంశాలపై వ్యవస్థీకృత పర్యవేక్షణ, అభిప్రాయ సేకరణ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. పైలట్ ప్రాజెక్టులను అమలు చేస్తున్న సంస్థలు క్రమం తప్పకుండా నివేదికలు సమర్పిస్తుండగా, వాటి ఆధారంగా హైడ్రోజన్ ఆధారిత రవాణా సాంకేతికతకు సంబంధించిన సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాలను అంచనా వేసి, భవిష్యత్తులో దేశవ్యాప్తంగా గ్రీన్ హైడ్రోజన్ వాహనాల విస్తరణకు అవసరమైన విధానాలను రూపొందించనున్నట్లు వివరించారు.ఈ సమాధానం ద్వారా దేశంలో స్వచ్ఛ ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు, భవిష్యత్తు రవాణా రంగంలో గ్రీన్ హైడ్రోజన్‌కు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టమైందని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, దిగుమతి ఇంధనాలపై ఆధారపడటం తగ్గించడం, పర్యావరణహిత రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడం వంటి లక్ష్యాల సాధనలో ఈ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## ప్రధాని పర్యటనలో ప్రతీ ఒక్కరూ ఉత్సాహంతో పని చేయాలి..!!

**– విజయనగరం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్, ఐపిఎస్**



( నేటి శుభోదయ జులై : 30 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ ఆగస్టు 1న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో బందోబస్తు విధులు నిర్వహించే ప్రతీ ఒక్కరూ ఉత్సాహంతో పని చేయాలని జూలై 29న జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు.జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ – ప్రధాని పర్యటనలో ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు , సిబ్బంది బాధ్యతతో పని చేయాలన్నారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆక్టోపస్, గ్రేహౌండ్స్ ఐజీ కె.శ్రీకాంత్, విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి, గ్రేహౌండ్స్ డీఐజీ అట్టాడ బాపూజీ, వెల్ఫేర్ డీఐజీ అన్బురాజన్, బెటాలియన్ కమాండెంట్ రవిశంకర్ రెడ్డి, విజయవాడ డీసీపీ కృష్ణకాంత్ పటేల్ గార్లతో కలసి ప్రధాని సభకు బస్సులో ప్రజలు వచ్చే మార్గాలను పరిశీలించారు. నిర్మాణ పనులు అవుతున్నందున ప్రజలకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా బ్యారికేడ్లు నిర్మించాలని, ర్యాంపులు నిర్మించాలని సంబంధిత అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. బందోబస్తు నిమిత్తం వచ్చిన పోలీసు సిబ్బందితో జిల్లా ఎస్పీ మాట్లాడి విధులను అంకిత భావంతోను, క్రమశిక్షణతో నిర్వహించాలని, తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు విధులు నిర్వహించేందుకు కేటాయించిన ప్రాంతాలను విడిచి పెట్టవద్దని జిల్లా ఎస్పీ ఆదేశించారు. బందోబస్తు నిమిత్తం భోగాపురం వచ్చిన పోలీసు సిబ్బందికి వసతులను, భోజనాలను జిల్లా పోలీసుశాఖ ఏర్పాటు చేసింది. సభ నిర్వహించే ప్రాంతాలను, ఎయిర్‌పోర్ట్ ఆవరణంలో పలు ప్రాంతాలను డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ప్రధాని పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు, సిబ్బంది సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని, పోలీసుశాఖ చేపడుతున్న చర్యలకు ప్రజలు తమవంతు సహకారాన్ని అందించాలని ప్రజలకు జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆక్టోపస్ మరియు గ్రేహౌండ్స్ ఐజీ కె.శ్రీకాంత్, విశాఖ ఐజీ గోపీనాథ్ జట్టి, గ్రేహౌండ్స్ డీఐజీ బాపూజీ, వెల్ఫర్ డీఐజీ అన్బురాజన్, బెటాలియన్ కమాండెంట్ రవిశంకర్ రెడ్డి, విజయవాడ డీసీపీ కృష్ణకాంత్ పటేల్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విజయపురి సౌత్ విమానాశ్రయ పనులు పరిశీలించిన మాచర్ల తహసీల్దార్ కిరణ్ కుమార్



మాచర్ల జులై 29 నేటి శుభోదయ :విజయపురి సౌత్ లో ప్రతిపాదిత విమానాశ్రయ నిర్మాణ పనులు వేగం పుంజుకుంటున్నాయి. విమానాశ్రయం నిర్మాణం కోసం అవసరమైన 799 ఎకరాల భూమిని సిద్ధం చేసి పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీకి పంపించిన నేపథ్యంలో, అభివృద్ధి పనులపై అధికారులు కసరత్తు ప్రారంభించారు.మాచర్ల తహసీల్దార్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఇరిగేషన్, విద్యుత్, అటవీ శాఖల అధికారులు నేడు బుధవారం ప్రతిపాదిత విమానాశ్రయ ప్రాంతాన్ని సంయుక్తంగా పరిశీలించారు. విమానాశ్రయానికి చేరుకునే రవాణా సౌకర్యాల మెరుగుదల పై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు, టీ జంక్షన్ నుంచి విమానాశ్రయం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు.అదేవిధంగా విమానాశ్రయానికి భవిష్యత్తులో తాగునీటి కొరత తలెత్తకుండా జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా నీటి సరఫరా అందేలా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులు క్షేత్రస్థాయిలో సమీక్షించారు. విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ స్తంభాల ఏర్పాటు, లైన్ల నిర్మాణానికి అవసరమైన ప్రాంతాలను కూడా పరిశీలించి సంబంధిత శాఖలకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక మౌలిక వసతుల అభివృద్ధి పనులు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, విమానాశ్రయ నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విమానాశ్రయం ఏర్పాటుతో పల్నాడు జిల్లా అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఇంటింటికీ కూటమి ప్రభుత్వ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి



అనంత పురం జూలై 29 నేటి శుభోదయ : నగరంలోని బూతు నంబర్162 లో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో అనంతపురం మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి పాల్గొన్నారు.ప్రతి ఇంటికీ, దుకాణం వద్దకు వెళ్లి రెండేళ్ల పాలన గురించి మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజా స్పందనను తెలుసుకున్నారు. అలాగే కొన్ని చోట్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బల్లా పల్లవి మాట్లాడుతూ రెండేళ్ల పాలన పై ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. అభివృద్ధిపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ఐదేళ్ల గొడ్డలి పార్టీ పాలనలో ప్రజల్ని పీడించారు, రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. పక్క రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రం వెనుకబడిపోయిందని.. ఇలాంటి సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభవంతో రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టారన్నారు. ప్రతినెల 1వ తేదిన పింఛన్లు, వేతనాలు, రేషన్ బియ్యం అందిస్తున్నామన్నారు. కేవలం 150రోజుల్లోనే మెగా డీఎస్సీ ప్రక్రియని పూర్తి చేసి.. 15,347ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నగరంలో 2 ఏళ్లలోనే మౌళిక వసతుల కోసం 200కోట్లు ఖర్చు ఖర్చు చేసామని మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి స్పష్టం చేశారు.

## మధురవాడలో వైభవంగా శ్రీ విజయదుర్గా దేవి 'శాకాంబరి' అలంకరణ..!!



( నేటి శుభోదయ జులై : 30 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) ఆషాఢ మాస శుద్ధ పౌర్ణమి (గురుపౌర్ణమి)పర్వదినాన్ని పురస్కరించుకుని మధుర వాడ టైలర్స్ కాలనీలో వేంచేసియున్న శ్రీ విజయ దుర్గా దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా జరిగాయి ఈ శుభ సందర్భాన్ని పురస్క రించుకుని అమ్మవారికి శాస్త్రోక్తంగా పంచామృతాలు నారికేళ(కొబ్బరి) జలాలు, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు అనంతరం నూతన వస్త్ర సమర్పణ చేసి వివిధ రకాల ఆకుకూరలు, కూర గాయలతో అమ్మవారిని 'శాకాంబరి దేవి'గా నేత్ర పర్వంగా అలంకరించారు ఈ సందర్భంగా ఆలయం లో విశేష అర్చనలు,సహస్ర కుంకుమార్చనలు భక్తిశ్రద్ధల తో సాగాయి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ గరిమెళ్ళ శర్మ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయని ఆలయ ధర్మకర్త బంగారు లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆలయ ప్రతినిధులు, బంగారు ప్రకాష్, తెంటు మాధవి,భరణ్, కౌషిక్,కార్తికేయ అమ్మవారి భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## విశాఖలో శ్రీ సత్యనారాయణ స్వామివారిని దర్శించికున్న హోంమంత్రి అనిత



( నేటి శుభోదయ జులై : 30 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖపట్నం, జులై 29:- విశాఖపట్నంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పూర్ణ మార్కెట్ సమీపంలోని కొండపై వెలసిన శ్రీ సత్యనారాయణ స్వామి వారిని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత గురుపౌర్ణమి సందర్భంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న హోంమంత్రి అనితకు దేవస్థాన అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా,ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను హోంమంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులతో ఆప్యాయంగా మాట్లాడిన హోంమంత్రి అనిత యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గురుపౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో,ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ సత్యనారాయణ స్వామిని మంత్రి ప్రార్థించారు.

## 26వ డివిజన్‌లో "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, జూలై 29 (నేటి శుభోదయ):- 26వ డివిజన్ చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన వద్ద నుండి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం -- సంక్షేమం, అభివృద్ధి" కార్యక్రమంలో భాగంగా బుధవారం "ఇంటింటికి తెలుగుదేశం" ప్రచార కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే సామాజిక పింఛన్‌ను రూ.3,000 నుంచి రూ.4,000కు పెంచి ఎన్నికల హామీని నిలబెట్టుకుందని,"తల్లికి వందనం" పథకం ద్వారా ప్రతి అర్హత కలిగిన విద్యార్థికి ఆర్థిక సహాయం అందిస్తున్నామని, ప్రతి మహిళకు సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. అలాగే అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, మహిళల ఉపాధి కోసం కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాల ఏర్పాటు వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని ఉమా చెప్పారు. త్వరలో మహిళల ఆర్థిక సాధికారత కోసం "స్త్రీనిధి" పథకాన్ని ప్రవేశపెట్టి అర్హులైన మహిళలకు ఏడాదికి రూ.18,000 చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు వెల్లడించారు. సెంట్రల్ నియోజకవర్గంలో గత రెండేళ్లలో రూ.550 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామని, అందులో రూ.350 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి ప్రాజెక్టులు, కమ్యూనిటీ హాళ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాల భవనాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఎంపీ శ్రీ కేశినేని శివనాథ్ (చిన్ని)తో కలిసి రూ.100 కోట్ల వ్యయంతో రాజ చీశీ.316 ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించామని చెప్పారు. అజిత్ సింగ్‌నగర్ వాంబే కాలనీలో రూ.85 కోట్లతో 43 మీఎల రా వాటర్ ఫిల్ట్రేషన్ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతులు సాధించామని, త్వరలో శంకుస్థాపన చేసి సెంట్రల్ నియోజకవర్గంలోని 21 డివిజన్లకు స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, సెంట్రల్ నియోజకవర్గ అబ్జర్వర్ బచ్చుల బోస్, డివిజన్ అధ్యక్షులు తోట పాండు, వల్లభనేని సతీష్, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా లక్ష్యంగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణ పనులకు వేగం.

**ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బొండా ఉమా**



విజయవాడ, జూలై 29 (నేటి శుభోదయ):- విజయవాడ సెంట్రల్ లోని వాంబే కాలనీ సమీపంలో వాటర్ సప్లై విభాగం ఆధ్వర్యంలో మంజూరైన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం కోసం ప్రతిపాదించిన స్థలాన్ని బుధవారం ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.ప్రజలకు నాణ్యమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.స్థల పరిశీలన సందర్భంగా ప్రతిపాదిత ప్రాంతం విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితులు, నీటి వనరుల లభ్యత, పైప్‌లైన్ అనుసంధానం, విద్యుత్ సౌకర్యం, రాకపోకల మార్గాలు, భవిష్యత్తులో విస్తరణకు ఉన్న అవకాశాలు, నిర్మాణానికి అనుకూల పరిస్థితులు తదితర అంశాలను ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రాజెక్టు అమలులో ఎలాంటి సాంకేతిక, పరిపాలనా అవరోధాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా వాటర్ సప్లై విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. గోపాల కృష్ణమూర్తి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (రాజుజు) ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను ఎమ్మెల్యే కు వివరించారు. వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలు, అంచనా వ్యయం, నిర్మాణ దశలు, అమలు కాలపట్టిక, శుద్ధి సామర్థ్యం, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ప్రణాళికతో పాటు ప్రాజెక్టు పూర్తయిన అనంతరం వేలాది మంది ప్రజలకు నాణ్యమైన తాగునీటి సరఫరా మెరుగుపడే విధానాన్ని వివరించారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుందని . ప్రజలకు సురక్షితమైన, స్వచ్ఛమైన, నాణ్యమైన తాగునీటిని నిరంతరాయంగా అందించడం ప్రభుత్వ సంకల్పమని తెలిపారు.ఈ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం పూర్తయిన తర్వాత పరిసర ప్రాంతాల ప్రజలకు దీర్ఘకాలికంగా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, పనులను నాణ్యతా ప్రమాణాలతో, పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, ఎలాంటి నిర్లక్ష్యం లేదా జాప్యం చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను దశలవారీగా చేపట్టాలని, ప్రతి రూపాయి ప్రజా ధనం సద్వినియోగం అయ్యేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు, అభివృద్ధి పనుల అమలులో ప్రజల అవసరాలకే ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి మరిన్ని చర్యలు కొనసాగుతాయని ఉమా తెలిపారు.ఈ కార్యక్రమంలో వాటర్ సప్లై విభాగం అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## త్యేక ఫ్రాంచైజీ ప్రాజెక్టుల ద్వారా స్వయం ఉపాధికి డ్వాక్రా మహిళలకు సువర్ణావకాశం

విజయవాడ, జూలై 29 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి ద్వారా డ్వాక్రా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రత్యేక ఫ్రాంచైజీ ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఇంచార్జి కమిషనర్ ఏ. రవీంద్రరావు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, పట్టణ నిరుద్యోగ మహిళలు, యువతులు తక్కువ పెట్టుబడితో వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి స్థిరమైన ఆదాయాన్ని పొందేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రముఖ బ్రాండ్ల సహకారంతో మల్టీ బ్రాండ్ మార్ట్‌లు, రిటైల్ స్టోర్లు, టీ ఉ స్నాక్స్ అవుట్‌లెట్లు, ఫుడ్ కోర్టులు, మిల్లెట్స్ మార్ట్‌లు, కాఫీ అవుట్‌లెట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, బ్యూటీ సలూన్లు, ఎంబ్రాయిడరీ యూనిట్లు తదితర వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.వ్యాపారం నిర్వహించేందుకు అవసరమైన శిక్షణ, బ్రాండ్ మద్దతు, మార్కెటింగ్ సహాయం, బ్యాంకు రుణాల సమన్వయం, ప్రభుత్వ పథకాల అనుసంధానం వంటి సేవలను వీజూహీూ ద్వారా అందించనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు తమ సామర్థ్యానికి, ఆసక్తికి అనుగుణంగా ఫ్రాంచైజీని ఎంపిక చేసుకుని స్వయం ఉపాధి పొందే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, 18 నుండి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల డ్వాక్రా మహిళలు అర్హులని, సంబంధిత పత్రాలతో తమ ప్రాంత కమ్యూనిటీ ఆర్గనైజర్, టౌన్ లెవల్ ఫెడరేషన్, సిడిఓ, విఎంసి కార్యాలయంలో గల యుసిడి విభాగం లో లవ్లీ హుడ్ ప్రమోషన్ సెల్ వారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ అవకాశాన్ని నగరంలోని అర్హులైన డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకుని తమ కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

## పెడగంట్యాడ ఏరియా కి చెందిన ట్రూత్ చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన

**– ఇద్దరు బాలురు బయిటికి వచ్చేయగా వారిని గుర్తించి ట్రస్ట్ ప్రతినిధులకు అప్పగించిన విషయం గురించి.**




( నేటి శుభోదయ జులై : 30 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) సీపీ ఆదేశాల మేరకు, ఏసీపీ విషయాన్ని తెలియజేయగా, సీఐ మరియు ఎస్ఐ విషయాన్ని గుర్తించారు.బుధవారం బదనైనా అఖిల్ మరియు మామిడి రాజేంద్ర వర్మ అనే ఇద్దరు బాలురు గాజువాక ఆలూరి టవర్స్ సమీపంలో బ్లూ కోల్ట్స్ సిబ్బందికి కనిపించగా, వారు వారిని గాజువాక పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. బాలుర వద్ద ఉన్న పుస్తకాలు మరియు ఇతర రికార్డులను పరిశీలించగా, జీవన్ అనే కుర్రాడి ఫోన్ ద్వారా వారి వివరాలను ధృవీకరించగా, జీవన్ తల్లిదండ్రులను ఫోన్ ద్వారా సంప్రదించగా, వారు ఈ ఇద్దరు బాలురు తమకు తెలిసిన వారేనని, తమ పక్క గ్రామానికి చెందినవారని తెలిపారు. అలాగే ట్రూత్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధుల ఫోన్ నంబర్‌ను అందజేయడంతో వారిని వారు పెదగంట్యాడ ట్రూత్ చారిటబుల్ ట్రస్ట్ కు చెందిన బాలురని గుర్తించబడింది. అనంతరం ఆ ట్రస్ట్‌లో 3వ తరగతి హాస్టల్ విద్యార్థి వెంటనే సంప్రదించడం జరిగింది.ట్రస్ట్ ప్రతినిధులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి బాలురను గుర్తించి ధృవీకరించారు. బాలుర తల్లిదండ్రులను కూడా ఫోన్ ద్వారా సంప్రదించగా, వారు అరకు ప్రాంతంలో ఉన్నందున పోలీస్ స్టేషన్‌కు రావడం సాధ్యం కాదని, బాలురను ట్రస్ట్ ప్రతినిధులకే అప్పగించాలని కోరారు.అనంతరం అవసరమైన ధృవీకరణ పూర్తి చేసి, ఇద్దరు బాలురను ట్రూత్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులకు సురక్షితంగా అప్పగించడం జరిగినది.

## పూజల్లో పాల్గొన్న మార్కెట్ యాడ్ చైర్పర్సన్ బల్లా పల్లవి





అనంత పురం జూలై 29 నేటి శుభోదయ: గురుపౌర్ణమి పౌర్ణమి సందర్భంగా అనంతపురం నగరంలో శ్రీ సాయిబాబా వారి ఆలయంలో మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు . సాయినాథుని కృప, గురువుల ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు.

# మెడ వణుకుతోంది... కనీసం ఫోన్‌ను పట్టుకోలేకపోతున్నా!



ఆ యువతి తరచూ మెడ నొప్పి, చేతుల్లో బలం తగ్గిపోతున్న సమస్యతో డాక్టర్‌ను సంప్రదించింది. తన జీవనశైలి, రోజువారీ అలవాట్లు, ఉద్యోగ ఒత్తిడి, నిద్రపోయే భంగిమ.. ఇవన్నీ కారణాలేమోనని ఆమె ముందుగానే అనుకుంది. కానీ అన్ని వివరాలు విన్న తర్వాత డాక్టర్ చెప్పిన మాటలు ఆమెను ఆశ్చర్యంలో ముంచేశాయి. “అది సాధారణ అలసట కాదు... ఆమె శరీరం ఫోన్ ప్రభావానికి లోనవుతోంది” అనే వ్యాఖ్యతో అసలు సమస్యపై కొత్త చర్చ మొదలైంది. స్మార్ట్‌ఫోన్ వినియోగం ఇప్పుడు లింగ భేదానికి పరిమితం కాని సమస్యగా మారుతోందని నిపుణులు చెబుతున్నారు. గంటల తరబడి స్క్రీన్‌పై గడపడం వల్ల మెడపై ఒత్తిడి పెరగడం, భంగిమలో మార్పులు, చేతి బలం తగ్గడం వంటి లక్షణాలు యువతలో సాధారణంగా కనిపిస్తున్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా పని, చదువు, వినోదం అన్నీ డిజిటల్ పరికరాలపైనే ఆధారపడటం వల్ల ఈ ప్రభావం మరింత విస్తరిస్తోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇది ఒక్కరి సమస్య కాదు... ఆధునిక జీవనశైలి కలిగిస్తున్న సామూహిక ఆరోగ్య సవాలుగా మారుతోందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు వంటి డిజిటల్ పరికరాలు మన శరీర ఆకృతినే నిశ్శబ్దంగా ప్రభావితం చేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల మెడ వంగిపోవడం, చూపు బలహీనపడటం, చేతి బలం తగ్గడం, మోటార్ స్కిల్స్‌పై ప్రభావం వంటి సమస్యలు పెరుగుతున్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. పైగా ఈ మార్పులన్నింటినీ ఇప్పుడు నిపుణులు ఒక కొత్త పదంతో వివరిస్తున్నారు. అదే “ఫోన్ బాడీ ”. అంటే.. ఫోన్ అధికంగా ఉపయోగించడం వల్ల శరీరంలో కనిపిస్తున్న మార్పులు, భంగిమలో వచ్చే మార్పుల సమాహారం అని దీని అర్థం. ఇది వైద్యపరంగా అధికారిక పదం కాకపోయినా.. ఆధునిక జీవనశైలి ప్రభావాన్ని వివరించేందుకు వాడుతున్నారు. బీబీసీ టెక్నాలజీ జర్నలిస్ట్ థామస్ జర్మైన్ తన తాజా వ్యాసంలో ఈ వివరాలను సమగ్రంగా వెల్లడించారు. అందులో నిపుణుల చెప్పిన వివరాల ప్రకారం సమస్య కేవలం “స్క్రీన్ టైమ్” మాత్రమే కాదు.. ఎక్కువ సమయం ఇంట్లో కూర్చొని ఫోన్, కంప్యూటర్‌లకు అతుక్కుపోవడం కూడా ప్రధాన కారణంగా మారుతోంది. ముఖ్యంగా పిల్లలు, యువతలో శారీరక చురుకుదనం తగ్గిపోవడం దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తోందని హెచ్చరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా మయోపియా (దూరం చూపు బలహీనత) కేసులు వేగంగా పెరుగుతున్నాయి. అయితే దీని ప్రధాన కారణం ఫోన్‌ను దగ్గరగా చూడటం మాత్రమే కాదని, బయట సమయం తగ్గిపోవడమే ముఖ్య కారణమని నిపుణులు చెబుతున్నారు. సహజ కాంతి కళ్ల ఆరోగ్యానికి సహాయపడుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. మరోవైపు “టెక్ నెక్” అనే సమస్య కూడా వేగంగా పెరుగుతోంది. నిరంతరం తల వంచి ఫోన్ చూడటం వల్ల మెడపై తీవ్ర ఒత్తిడి పడుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తల వంచే కోణం పెరిగే కొద్దీ మెడపై పడే బరువు అనేక రెట్లు పెరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. దీని వల్ల నొప్పులు, కండరాల గట్టిపడటం మాత్రమే కాకుండా భవిష్యత్తులో పోశ్చర్ మార్పులు కూడా రావచ్చని డెర్మటాలజీ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక చేతి బలం విషయంలోనూ ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా యువతలో గ్రిప్ స్ట్రెంగ్త్ తగ్గుతున్నట్లు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది కేవలం చేతుల బలహీనత మాత్రమే కాకుండా మొత్తం శారీరక ఆరోగ్య సూచికగా పరిగణించబడుతోంది. టెక్నాలజీ మోటార్ స్కిల్స్‌పైనా ప్రభావం చూపుతోందని పరిశోధకులు చెబుతున్నారు. ఫోన్‌పై స్వైప్ చేయడం, క్లిక్ చేయడం వంటి పనుల్లో నైపుణ్యం పెరుగుతున్నప్పటికీ, చేతి-మెదడు సమన్వయంపై దీర్ఘకాలిక ప్రభావం ఉండొచ్చని హెచ్చరిస్తున్నారు. అయితే నిపుణులు భయపడాల్సిన అవసరం లేదని సూచిస్తున్నారు. రోజూ కొంతసేపు ఫోన్‌కు విరామం ఇవ్వడం.. కొన్ని అలవాట్లు మార్చుకుంటే “ఫోన్ బాడీ” ప్రభావాలను గణనీయంగా తగ్గించుకోవచ్చు.

### 20--20--20 రూల్

ప్రతి 20 నిమిషాలకు ఒకసారి, 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును కనీసం 20 సెకన్లు చూడాలని సూచిస్తున్నారు. ఇది కంటి ఒత్తిడిని తగ్గిస్తుంది.

### మెడ పోశ్చర్‌పై దృష్టి

ఫోన్‌ను కిందకి వంచి చూడకుండా, కంటి లెవెల్‌లో ఉంచుకోవడం ద్వారా “టెక్ నెక్” ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

### స్క్రీన్ టైమ్ పరిమితి

రోజులో నిర్దిష్ట సమయాన్ని మాత్రమే ఫోన్ వినియోగానికి కేటాయించడం మంచిదని నిపుణుల సూచన. అవసరం లేని స్క్రోలింగ్ తగ్గించాలి.

### శారీరక కదలికలు తప్పనిసరి

ప్రతి గంటకోసారి లేచి నడవడం, స్ట్రెచింగ్ చేయడం వల్ల కండరాల గట్టిపడటం తగ్గుతుంది.

### గ్రిప్ - చేతి వ్యాయామాలు

బంతి పట్టుకోవడం, స్ట్రెస్ బాల్ వాడడం, చిన్న హ్యాండ్ ఎక్సర్‌సైజ్‌లు చేయడం చేతి బలం మెరుగుపరుస్తాయని చెబుతున్నారు.

### బయట గడిపే సమయం పెంచాలి

సహజ కాంతి కళ్ల ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. రోజులో కనీసం కొంత సమయం బయట గడపడం మయోపియా ప్రమాదాన్ని తగ్గించగలదు.

### డిజిటల్ డీటాక్స్ అలవాటు

వారానికి ఒకసారి కొన్ని గంటలు ఫోన్ లేకుండా గడపడం మానసికంగా, శారీరకంగా ఉపశమనం ఇస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తం మీద, ఫోన్ ఇప్పుడు మన జీవితంలో భాగంగా మారినప్పటికీ, అది శరీరంపై నెమ్మదిగా కానీ స్పష్టంగా ప్రభావం చూపుతోందని తాజా పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. టెక్నాలజీని పూర్తిగా దూరం చేయలేకపోయినా, దాన్ని నియంత్రితంగా ఉపయోగించడం ద్వారా శరీరంపై దాని ప్రభావాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# కంటి సమస్యలు ఉన్నవారు తీసుకోవాల్సిన ఆహారాలు ఇవే.. వీటితో ఎన్నో ఉపయోగాలు..

కళ్లు పొడిబారడం (డ్రై ఐ సిండ్రోమ్) ప్రస్తుతం చాలా మందిలో కనిపిస్తున్న సాధారణ సమస్య. ఎక్కువసేపు కంప్యూటర్, మొబైల్ స్క్రీన్‌లను చూడటం, ఏసీ గదుల్లో ఎక్కువ సమయం గడపడం, వయస్సు పెరగడం, కొన్ని ఆరోగ్య సమస్యలు లేదా పోషకాల లోపం వంటి కారణాల వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. దీనివల్ల కళ్లలో మంట, ఎర్రబడటం, మసకగా కనిపించడం, కనురెప్పలు అతుక్కుపోయినట్లు అనిపించడం వంటి ఇబ్బందులు ఎదురవుతాయి. అయితే కొన్ని సహజమైన చిట్కాలు, సరైన ఆహారపు అలవాట్లు ఈ సమస్య నుంచి ఉపశమనం కలిగించడంలో సహాయపడతాయి. కళ్ల ఆరోగ్యానికి విటమిన్ ఎ, విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం అవసరం. ముఖ్యంగా విటమిన్ ఎ కంటి ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. క్యారెట్, బొప్పాయి, మామిడి, పాలకూర వంటి ఆకుకూరలు, పసుపు, ఎరుపు, ఆకుపచ్చ రంగు కూరగాయలను ఆహారంలో చేర్చడం వల్ల అవసరమైన పోషకాలు అందుతాయి. అలాగే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల కళ్లలో సహజంగా కన్నీటి ఉత్పత్తి మెరుగుపడి పొడిబారడం తగ్గే అవకాశం ఉంటుంది.

### ఈ చిట్కాలను పాటించాలి..

కొబ్బరి నూనె కూడా డ్రై ఐ సమస్యల్లో కొంత ఉపశమనం కలిగిస్తుంది. ఇందులో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ, తేమను కాపాడే గుణాలు కళ్ల చుట్టూ ఉన్న చర్మాన్ని మృదువుగా ఉంచడంలో సహాయపడతాయి. రెండు నుంచి మూడు చుక్కల కొబ్బరి నూనెను కళ్ల చుట్టూ నెమ్మదిగా రెండు నుంచి మూడు నిమిషాలు మసాజ్ చేసి, చర్మం పూర్తిగా పీల్చుకునే వరకు వదిలేయాలి. అయితే నూనె నేరుగా కంట్లో పడకుండా జాగ్రత్త వహించాలి. కీరదోస ముక్కలను కళ్లపై ఉంచడం కూడా ఉపశమనం కలిగించే చిట్కాల్లో ఒకటి. చల్లగా ఉంచిన కీరదోస ముక్కలను 15 నిమిషాల పాటు కళ్లపై ఉంచితే మంట, దురద, ఎర్రదనం తగ్గడంలో సహాయపడుతుంది. కీరదోసలో ఉండే విటమిన్ ఎ కళ్లకు పోషణ అందించడంలో ఉపయోగపడుతుంది. రోజూ ఒక గిన్నె పెరుగు తినడం కూడా కళ్ల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పెరుగులో విటమిన్ డి, విటమిన్ బి, విటమిన్ ఎ వంటి పోషకాలు ఉండటంతో కళ్లకు అవసరమైన పోషణ అందించి పొడిబారడం వల్ల కలిగే అసౌకర్యాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.



### ఎక్కువ సేపు ఫోన్ లేదా కంప్యూటర్ చూస్తే..

కళ్లను తరచూ రెప్పవేయడం కూడా చాలా ముఖ్యమైన అలవాటు. రెప్పవేయడం వల్ల సహజంగా కన్నీటి పొర కంటి ఉపరితలంపై సమానంగా వ్యాపించి తేమను నిలబెడుతుంది. ముఖ్యంగా కంప్యూటర్ లేదా మొబైల్‌ను ఎక్కువసేపు ఉపయోగించే వారు ప్రతి కొద్ది నిమిషాలకు ఒకసారి రెప్పవేయడాన్ని అలవాటు చేసుకోవాలి. గోరువెచ్చని నీటిలో ముంచిన మెత్తని వస్త్రంతో కళ్లకు కాపడం పెట్టడం కూడా మంచి ఉపశమనం ఇస్తుంది. మెత్తని వస్త్రాన్ని గోరువెచ్చని నీటిలో ముంచి అదనపు నీటిని పిండి, కళ్లపై ఏడు నుంచి ఎనిమిది నిమిషాల పాటు ఉంచాలి. ఇలా చేయడం వల్ల కళ్ల చుట్టూ రక్తప్రసరణ మెరుగుపడి సహజమైన తేమ ఉత్పత్తికి దోహదపడుతుంది. అయితే కళ్లు పొడిబారడం ఎక్కువకాలం కొనసాగితే, తీవ్రమైన నొప్పి, చూపు తగ్గడం లేదా ఇతర అసాధారణ లక్షణాలు కనిపిస్తే ఇంటి చిట్కాలపై మాత్రమే ఆధారపడకుండా వెంటనే నేత్ర వైద్యుడిని సంప్రదించడం అవసరం.

# ఆరోగ్యంగా ఉండాలంటే మందులను మింగడమే కాదు, పోషకాహారం తీసుకోవడం కూడా ముఖ్యమే..



ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో మందులతోపాటు ఆహారం కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా కూరగాయల్లో ఉండే విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు శరీరానికి అవసరమైన పోషకాలను అందించి అనేక ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. కొన్ని కూరగాయలను క్రమం తప్పకుండా ఆహారంలో చేర్చుకోవడం వల్ల కాలేయ ఆరోగ్యం, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు, జీర్ణక్రియ, రోగనిరోధక శక్తి వంటి అంశాలకు మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. కాలేయంలో కొవ్వు పేరుకుపోయే ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు కాలీఫ్లవర్‌ను ఆహారంలో చేర్చుకోవచ్చు. ఇందులో ఉండే ఇండోల్స్, గ్లూకోసినోలేట్స్ వంటి సమ్మేళనాలు కాలేయం సహజంగా వ్యర్థాలను తొలగించడంలో తోడ్పడి, కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

### బీట్‌రూట్, కాకరకాయ, పాలకూర..

రక్తపోటు ఉన్నవారికి బీట్‌రూట్ ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో ఉండే సహజ నైట్రేట్లు శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారి రక్తనాళాలను విస్తరించడంలో సహాయపడతాయి. దీంతో రక్తప్రసరణ మెరుగుపడి రక్తపోటు నియంత్రణకు తోడ్పడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నవారు కాకరకాయను ఆహారంలో చేర్చుకోవడం మంచిది. ఇందులో ఉండే పోలీపెప్టైడ్-పీ, కారంటిన్ వంటి సమ్మేళనాలు సహజ ఇన్సులిన్ మాదిరిగా పనిచేసి గ్లూకోజ్ నియంత్రణకు దోహదపడతాయని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో ఐరన్ లోపం ఉన్నవారికి పాలకూర మంచి ఎంపిక. ఇందులో ఐరన్‌తోపాటు ఫోలేట్ కూడా సమృద్ధిగా ఉంటుంది. ఇవి ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి అవసరం. పాలకూరతోపాటు నిమ్మరసం వంటి విటమిన్ సి అధికంగా ఉండే పదార్థాలను తీసుకుంటే ఐరన్ శోషణ మరింత మెరుగుపడుతుంది.

### ముల్లంగి, క్యారెట్..

జీర్ణక్రియ సమస్యలు ఉన్నవారికి ముల్లంగి ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే పీచుపదార్థం మలబద్ధకాన్ని తగ్గించి పేగుల పనితీరును మెరుగుపరుస్తుంది. అలాగే పిత్తరసం విడుదలను ప్రోత్సహించడం ద్వారా కొవ్వు జీర్ణక్రియకు కూడా సహాయపడుతుంది. కంటి ఆరోగ్యానికి క్యారెట్ ఎంతో మేలు చేస్తుంది. ఇందులో ఉండే బీటా కెరోటిన్ శరీరంలో విటమిన్ ఎగా మారి కంటి చూపును కాపాడటంలో, కంటి ఉపరితలాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు క్యాప్సికమ్‌ను ఆహారంలో చేర్చుకోవచ్చు. ఇందులో నారింజ కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. ఈ పోషకం తెల్ల రక్తకణాల ఉత్పత్తిని పెంచి ఇన్ఫెక్షన్లతో పోరాడేందుకు శరీరానికి సహాయపడుతుంది.

### తోటకూర, ఉసిరి..

చర్మం కాంతివంతంగా ఉండేందుకు తోటకూర ఉపయోగపడుతుంది. ఇందులో విటమిన్ సి, విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటంతో ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించి చర్మానికి సహజమైన మెరుపును అందించడంలో తోడ్పడుతుంది. ఉసిరికాయను పోషకాహార నిపుణులు సూపర్‌ఫుడ్‌గా పేర్కొంటున్నారు. ఇందులో నారింజ రసం కంటే ఎన్నో రెట్లు ఎక్కువ విటమిన్ సి ఉండటంతో రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా జుట్టు, గుండె ఆరోగ్యం, జీవక్రియకు కూడా మేలు చేస్తుంది. అయితే ఈ కూరగాయలు ఆరోగ్యానికి మేలు చేసినప్పటికీ, ఇవి వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కావని గుర్తుంచుకోవాలి. ఇప్పటికే ఏదైనా వ్యాధికి చికిత్స పొందుతున్నవారు వైద్యుల సూచనల మేరకు మందులు కొనసాగిస్తూ, సమతుల్య ఆహారంలో భాగంగా ఈ కూరగాయలను చేర్చుకోవడం ఉత్తమమని నిపుణులు తెలియజేస్తున్నారు.

# ‘ఏఐ’తో ‘ఆట’లొద్దు

- మనుషులకంటే ఏఐ బాగా అర్థం చేసుకుంటుందనుకుంటున్న జనం
- ఏఐ టూల్స్‌ను ఉపయోగిస్తున్న 65 శాతం మంది భారతీయులు
- ఇది ప్రపంచ సగటు 31 శాతంతో పోలిస్తే రెండింతలకు పైగా ఎక్కువ
- చిన్నారుల్లో భారీగా పెరుగుతున్న ఏఐ వినియోగం
- పిల్లల్లో స్వయంగా ఆలోచించే శక్తి తగ్గిపోయే ప్రమాదం
- ఆందోళన కలిగిస్తున్న ‘భారత్ సర్వే ఫర్ ఎడ్‌టెక్--2025’ గణాంకాలు

అమరావతి: కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రపంచవ్యాప్తంగా విద్య, ఆరోగ్యం, సమాచార రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. మన దేశంలోనూ ఏఐ వినియోగం వేగంగా పెరుగుతోంది. మైక్రోసాఫ్ట్ గ్లోబల్ ఆన్‌లైన్ సేఫ్టీ సర్వే--2024 ప్రకారం భారతీయుల్లో 65 శాతం మంది జనరేటివ్ ఏఐ టూల్స్‌ను ఉపయోగిస్తున్నారు. ఇది ప్రపంచ సగటు 31 శాతంతో పోలిస్తే రెండింతలకంటే ఎక్కువ. విద్యార్థులకు పాఠాలు అర్థం చేసుకోవడం, సందేహాల నివృత్తి, కొత్త విషయాలు నేర్చుకోవడంలో ఏఐ ఉపయోగపడుతోంది. అదే సమయంలో పిల్లల మానసిక ఆరోగ్యం, ఆలోచనా శక్తి, సృజనాత్మకత, గోప్యత వంటి అంశాలపై ప్రతికూల ప్రభావాలు చూపుతోంది. సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ నిర్వహించిన ‘భారత్ సర్వే ఫర్ ఎడ్‌టెక్ 2025’ అధ్యయనం తాజాగా ఈ విషయాన్ని వెల్లడించింది. అత్యంత ఆందోళనకర విషయం ఏమిటంటే, ముగ్గురిలో ఒకరు వారి వ్యక్తిగత సమస్యలు, భావోద్వేగాలను ఏఐతో పంచుకుంటున్నారు. ఏఐతో వ్యక్తిగత విషయాలు చర్చించిన వారిలో 25 శాతం మంది ‘మనుషుల కంటే ఏఐ నన్ను బాగా అర్థం చేసుకుంటుంది’ అని భావిస్తున్నారు.

### ఆలోచనా శక్తిపై ప్రభావం

ఇదే సర్వేలో మరో ఆందోళనకర అంశం బయటపడింది. ఏఐ గురించి తెలిసిన పిల్లల్లో 75 శాతం మంది ఏఐ పనితీరుపై అవగాహన లేక దాన్నొక సెర్చ్ ఇంజిన్‌లా భావిస్తున్నారు. అలాగే 46 శాతం కుటుంబాలు ఏఐ వల్ల తప్పుడు సమాచారం (మిస్‌ఇన్‌ఫర్మేషన్) వచ్చే ప్రధాన ప్రమాదమని పేర్కొన్నాయి. ఏఐ వెంటనే సమాధానాలు అందించడం వల్ల పిల్లలు స్వయంగా ఆలోచించడం, సమస్యలను విశ్లేషించడం, పరిష్కారాలు కనుగొనడం వంటి నైపుణ్యాలను కోల్పోయే ప్రమాదం ఉందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. హోంవర్క్, ప్రాజెక్టులు, వ్యాసాలు అన్నింటికీ ఏఐపై ఆధారపడితే సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం దెబ్బతినే అవకాశం ఉంది. యునిసెఫ్ నివేదికల ప్రకారం.. ఏఐ చాట్‌బాట్లతో ఎక్కువ సమయం గడిపే పిల్లల్లో ఒంటరితనం, భావోద్వేగ సంబంధాలు, సామాజిక సంబంధాలు తగ్గిపోవడం వంటి సమస్యలు కూడా తలెత్తవచ్చు.

### ‘ఏఐ’ రూపంలో కొత్త ముప్పు

ఏఐ అందించే సమాచారం ఎల్లప్పుడూ సరైనదే కావాల్సిన అవసరం లేదు. కొన్నిసార్లు వాస్తవాలకు విరుద్ధమైన లేదా తప్పుదారి పట్టించే సమాచారాన్ని కూడా అందించవచ్చు. చిన్నారులు దానిని నిజమని నమ్మే ప్రమాదం ఉంది. అలాగే వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, చాటింగ్ డేటా వంటి సమాచారాన్ని ఏఐ ప్లాట్‌ఫారమ్‌లలో పంచుకోవడం వల్ల గోప్యత సమస్యలు తలెత్తుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా ఏఐ టెక్నాలజీతో డీప్‌ఫేక్ చిత్రాలు, వీడియోలు సృష్టించడం సులభమవుతోంది. అమెరికాలో నిర్వహించిన ఒక సర్వే ప్రకారం 33 శాతం మంది టీనేజర్లు వారి అనుమతి లేకుండా వారి ఫొటోలను ఉపయోగించి డీప్‌ఫేక్ చిత్రాలు రూపొందించారని తెలిపారు. అలాగే 54 శాతం మంది ఇలాంటి కంటెంట్‌ను అందుకున్నట్లు చెప్పారు. యూకేలో 8 నుంచి 12 సంవత్సరాల పిల్లల్లో దాదాపు 22 శాతం మంది ఏఐ టూల్స్‌ను ఉపయోగిస్తున్నట్లు అధ్యయనాలు వెల్లడించాయి.




40 శాతం కంటే ఎక్కువ మంది పిల్లలకు ఏఐ భద్రత గురించి తల్లిదండ్రులు ఎప్పుడూ వివరించలేదు. ఏఐ వాడే పిల్లల్లో 50 శాతం కంటే ఎక్కువ మంది ఆరోగ్యం లేదా శరీరానికి సంబంధించిన సలహాల కోసం చాట్‌బాట్లను ఆశ్రయిస్తున్నారు. ఆరుగురిలో ఒకరు (సుమారు 17 శాతం) ఏఐ ద్వారా అనుచిత కంటెంట్ చూశామని తెలిపారు. ఈ నేపథ్యంలో పిల్లల విద్య, మానసిక అభివృద్ధిపై ప్రభావం ఉంటుందనే ఆందోళనతో కొన్ని దేశాలు పాఠశాలల్లో ఏఐ వినియోగంపై నియంత్రణ విధించాలని భావిస్తున్నాయి. కానీ ఏఐను పూర్తిగా నిరోధించడం సాధ్యం కాదు. పిల్లలు దానిపై పూర్తిగా ఆధారపడకుండా, ఇతర మంచి విషయాలవైపు మళ్లేలా వారికి మార్గనిర్దేశం చేయాలి. అలాగే తప్పుడు సమాచారం, గోప్యత, డీప్‌ఫేక్ ముప్పుల గురించి అవగాహన కల్పించడం అవసరం. ఏఐ టెక్నాలజీ భవిష్యత్తును మార్చగల శక్తివంతమైన సాధనం. అయితే నియంత్రణ లేకుండా వినియోగిస్తే పిల్లలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

### భారత్ సర్వే ఫర్ ఎడ్‌టెక్--2025 అధ్యయనం ప్రకారం ఏఐ వినియోగం ఇలా..

జనరేటివ్ ఏఐ టూల్స్ వినియోగిస్తున్న విద్యార్థులు -- 35 శాతం
వీరిలో సందేహాల నివృత్తికి -- 73 శాతం
కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడానికి -- 48 శాతం
పరీక్షల సన్నద్ధతకు -- 32 శాతం

### అమెరికాలో కామన్‌సెన్స్ మీడియా 2026 అధ్యయనం ప్రకారం..

9 నుంచి 17 సంవత్సరాల పిల్లల్లో ఏఐ వినియోగిస్తున్న వారు -- 86 శాతం
వీరిలో నిత్యం ఏఐతో మమేకమయ్యే వారు -- 25 శాతం
ఏఐ కంపానియన్ చాట్‌బాట్ల ఉపయోగించే టీనేజర్లు -- 72 శాతం
రోజూ వాటితో మాట్లాడేవారు -- 13 శాతం

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -“APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,“D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .